


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 18-02-2023 సంపుటి : 04 సంచిక : 154 పేజీలు : 4 వెల : రూ 3-00


## ఢిల్లీ మేయర్ ఎన్నిక..

# సుప్రీంలో ఆప్‌కు భారీ విజయం

ఢిల్లీ: ఎన్నికల్లో గెలిచి కూడా మేయర్ ఎన్నికకు ఆటంకాలు ఎదుర్కొంటున్న తరుణంలో.. ఆమ్‌ఆద్మీ పార్టీకి భారీ విజయం దక్కింది. నామినేటెడ్ సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనడానికి వీల్లేదని సుప్రీం కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా నామినేట్ చేసిన పది మంది కౌన్సిలర్లను.. మేయర్ కోసం జరిగే ఓటింగ్‌కు ప్రిసైడింగ్ ఆఫీసర్ సత్య శర్మ(బీజేపీ) అనుమతించారు. ఈ తరుణంలో వాళ్లంతా బీజేపీకే ఓటేస్తారని, సత్యశర్మ బీజేపీ గనుక సొంత పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆప్ మొదటి నుంచి వాదిస్తోంది. పైగా ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్(డీఎంసీ) యాక్ట్ 1957 ప్రకారం.. నామినేటెడ్ సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనేందుకు అర్హత లేదని గుర్తు చేసింది. ఈ తరుణంలో




మూడుసార్లు మేయర్ ఎన్నిక వాయిదా పడగా.. ఆప్ సుప్రీంను ఆశ్రయించింది. ఆప్ వాదనలతో ఏకీభవించిన సుప్రీం కోర్టు.. నామినేటెడ్ సభ్యులకు ఓటింగ్‌లో పాల్గొనే అర్హత లేదని స్పష్టం చేసింది. అంతేకాదు 24 గంటల్లో మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికపై నోటిఫికేషన్ ఇవ్వాలని.. ఎన్నిక నిర్వహణ తేదీని కూడా స్పష్టంగా ప్రకటించాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. దీంతో ఢిల్లీ మేయర్ ఎన్నికపై ప్రతిష్టంభన తొలిగిపోయే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు సుప్రీం తీర్పుపై ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ హర్షం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. జనవరి 6, జనవరి 24వ తేదీల్లో, ఫిబ్రవరి 6వ తేదీల్లో సభ్యుల ఆందోళన వల్ల నెలకొన్న గందరగోళం నేపథ్యంలో మూడుసార్లు మేయర్ ఎన్నిక వాయిదా పడింది. ఢిల్లీ చరిత్రలోనే మేయర్ ఎన్నిక ఆలస్యం కావడం ఇదే తొలిసారి. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక.. ఫలితాలు వెలువడిన నెలలోపే అదీ తొలి సెషన్‌లోనే జరిగిపోవాలి. అది జరుగుతూ వస్తోంది కూడా. కానీ, ఈసారి ఆ ఆనవాయితీకి బ్రేక్ పడినట్లయ్యింది. ఫలితాలు వెలువడి రెండు నెలలు గడుస్తున్నా ఇంకా మేయర్ ఎన్నికపై సస్పెన్స్ కొనసాగుతోంది

## తెదేపాలో చేరిన మహాసేన రాజేశ్

సామర్లకోట: వైకాపా ప్రభుత్వ విధానాలపై సోషల్ మీడియా వేదికగా సునిశిత విమర్శలు చేసే మహాసేన రాజేశ్ తెదేపా(౹ఆఖ)లో చేరారు. తూర్పుగోదావరి జిల్లా సామర్లకోటలో దళిత సామాజికవర్గంతో నిర్వహించిన సమావేశంలో తెదేపా అధినేత చంద్రబాబు ఆయనకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజేశ్ మాట్లాడుతూ "2019 ఎన్నికలకు ముందు చంద్రబాబును దళిత ద్రోహిగా సీఎం జగన్ చిత్రీకరించారు. జగన్ మాటలు విని చంద్రబాబును అపార్థం చేసుకున్నాం. అయితే నిజమైన దళిత ద్రోహి ఎవరో త్వరగానే గ్రహించాం. ఎస్సీలకు చంద్రబాబు 27 సంక్షేమ పథకాలను అమలు చేస్తే.. వైకాపా ప్రభుత్వం రాగానే జగన్ వాటిని రద్దు చేశారు. 2019లో తప్పు చేయకుండా ఉండుంటే అమరావతి నిర్మాణం పూర్తయ్యేది. దళితులు ఎవరి కాళ్లమీద వారు నిలబడేలా చంద్రబాబు చేశారు. చీకటి వచ్చాకే వెలుగు విలువ తెలుస్తుంది. జగన్ తుగ్లక్ పాలన చూశాక చంద్రబాబు పాలన రామరాజ్యం అని అర్థమవుతోంది" అని ఆయన వ్యాఖ్యానించారు.



# ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి లోపం ఉండకూడదు: సీఎం జగన్



అమరావతి: గృహ నిర్మాణ శాఖపై తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం సమీక్ష చేపట్టారు. వర్షాలు తగ్గిన తర్వాత డిసెంబర్ నుంచి ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోందన్నారు. ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి నాణ్యతా లోపం లేకుండా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. స్టేజ్ కన్వెర్షన్ కూడా బాగా జరిగిందని వివరించారు. ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతను పరీక్షించేందుకు మొత్తంగా 36 ల్యాబ్స్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఇళ్ల నిర్మాణంలో ఉపయోగించే మెటల్ నాణ్యతపై 285 పరీక్షలు, సిమెంటుపైన 34 పరీక్షలు, స్టీలుపై 84 పరీక్షలు, ఇటుకలపైన 95 టెస్టులు.. ఇలా పలురకాల పరీక్షలు నిర్వహించామన్నారు. ఎక్కడ లోపం వచ్చినా వెంటనే గుర్తించి నాణ్యతను పెంచుకునేందుకు ల్యాబ్స్ వినియోగపడుతున్నాయని అధికారులు వివరించారు. సీఎం జగన్ ఏమన్నారంటే.. సొంత ఇల్లు అనేది పేదవాడి కల, ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి లోపం ఉండకూడదు. ఈ ల్యాబ్స్‌ను వినియోగించుకుని ఎప్పటికప్పుడు పరీక్షలను నిర్వహించి, పేదవాడికి అత్యంత నాణ్యమైన ఇంటిని అందించాలి. లే అవుట్లలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసిన తర్వాత, వాటి నిర్వహణ విషయంలో గ్రామ, వార్డు సచివాలయాలు కీలక పాత్ర పోషించాలి. లే అవుట్లు పూర్తవుతున్న కొద్దీ మౌలిక సదుపాయాలను ప్రాధాన్యతా క్రమంలో ఏర్పాటు చేసుకుంటూ ముందుకుసాగాలని ముఖ్యమంత్రి జగన్ సూచించారు. కోర్టు కేసుల కారణంగా ప్రకాశం, అనంతపురం జిల్లాల్లోని 2 లే అవుట్లకు బదులుగా ప్రత్యామ్నాయ భూములను ఎంపిక చేశామని అధికారులు వెల్లడించారు. సుమారు 30 వేలమందికి ఇళ్ల నిర్మాణంలో కోర్టు కేసుల కారణంగా జాప్యం జరిగిందని, వీరికి త్వరలోనే పట్టాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఇందుకు అసవరమైన భూ సేకరణ కోసం అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సీఎం జగన్ ఆదేశించారు. ఇళ్ల నిర్మాణ కోసం ఈ ఆర్థిక సంవత్సరంలో జనవరి నెలాఖరు వరకూ చేసిన ఖర్చు రూ.7630 కోట్లు. ప్రభుత్వం ఇప్పటి వరకూ మొత్తంగా రూ.13,780 కోట్లు కేవలం ఇళ్ల నిర్మాణం కోసమే ఖర్చు చేసింది. ఇప్పటివరకూ సుమారుగా 2.75 లక్షల ఇళ్లను పూర్తిచేశామని, మరో 74వేల ఇళ్లలో శ్లాబ్స్ వేసే పనులు జరుగుతున్నాయని, మరో 79వేల ఇళ్లు రూఫ్ లెవల్లో ఉన్నాయని అధికారులు తెలిపారు. మార్చి నాటికి పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద చేపట్టిన ఇళ్లలో సుమారు 5 లక్షల ఇళ్లు పూర్తిచేసే దిశగా పనులు జరుగుతున్నాయని అధికారులు సీఎం జగన్‌కు వివరించారు. టిడ్కో ఇళ్లపైనా సీఎం జగన్ సమీక్ష..టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం గణనీయంగా సహాయం అందించిందని సీఎం జగన్ తెలిపారు. ఈ మూడున్నర సంవత్సరాలలో ఇళ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాలు, ఉచితంగా 300 అడుగులు ఇళ్లు, మిగిలిన కేటగిరీల లబ్ధిదారులకు తమవంతుగా చెల్లించిన వాటిపై సబ్సిడీ ఇవ్వడంతో పాటు, ఉచితంగా ప్రభుత్వం రిజిస్ట్రేషన్లు చేసింది. అధికారులు అందించిన వివరాల ప్రకారం.. టిడ్కో ఇళ్ల కోసం గత ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన ఖర్చు రూ.8015 కోట్లు అయితే ఈ ప్రభుత్వం చేసిన ఖర్చు, పేదలకు కల్పించిన ప్రయోజనాలు విలువ మొత్తంగా రూ.20,745 కోట్లని సీఎం జగన్ స్పష్టం చేశారు. టిడ్కో ఇళ్ల నిర్మాణ ఖర్చు కింద, మౌలిక సదుపాయాలకోసం ఈ మూడున్నర సంవత్సరాల్లోనే రూ.8,734 కోట్లు ఖర్చుచేశామని, దీంతోపాటు 300 అడుగుల ఇళ్లను ఉచితంగా ఇవ్వడం వల్ల దాదాపు రూ.10,339 కోట్ల రూపాయల లబ్ధి పేదలకు జరిగిందని తెలిపారు. వీరు తమ వంతుగా చెల్లించాల్సిన డబ్బును పూర్తిగా మాఫీ చేయడమే కాకుండా, బ్యాంకుల నుంచి అప్పు తీసుకోవాల్సిన అవసరం లేకుండా, నెలా నెలా వాయిదాలు కట్టాల్సిన పనిలేకుండా పూర్తి ఉచితంగా ఆ ఇళ్లను అందిస్తున్నామన్నారు. మిగిలిన వారికి ఊరట కల్పించే చర్యల్లో భాగంగా 365, 430 చదరపు అడుగులు ఇళ్లకు లబ్ధిదారులకు తమ వంతుగా చెల్లించాల్సిన డబ్బులో కల్పించిన సబ్సిడీ కారణంగా రూ. 482 కోట్ల మేర లబ్ధి జరిగిందని, ఆ మేరకు ప్రభుత్వం ఆ భారాన్ని కూడా తీసుకుంటుందన్నారు. అలాగే రిజిస్ట్రేషన్ ఛార్జీలను కూడా తొలగించి ఉచితంగా ఇళ్లు రిజిస్ట్రేషన్ చేయించడం ద్వారా మరో రూ.1200 కోట్ల భారాన్ని ప్రభుత్వం తీసుకుందని తెలిపారు.

## మహాశివరాత్రి విశిష్ట సామూహిక ఉచిత పూజలు

**:: ఆవుల పుల్లారెడ్డి సేవాసమితి.**

ఆళ్లగడ్డ :: (విభారె న్యూస్) :: ఆర్లగడ్డ పట్టణంలోని ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి మరియు వివేకానంద విశ్వ మానవ సేవా సమితి వారు శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని విశిష్ట మహా పూజలునిర్వహిస్తున్నారు. స్వస్తిశ్రీ శుభకృత నామ సంవత్సర మాఘమాస త్రయోదశి 18-2-23 అనగా ఈ శనివారం మహాశివరాత్రి ప్రత్యేక విశిష్టత కలిగి ఉంది ఈ సంవత్సరం మహాశివరాత్రి 26 సంవత్సరాలకు ఒకసారి వస్తుంది. శనివారం శనిత్రయోదశి కావడం విశేషం మరియు మాసశివరాత్రి అవ్వడం మరో ప్రత్యేక విశిష్టత. ఇన్ని కలిగిన ఈ మహాశివరాత్రి నాడు ఆ పరమేశ్వరుని సేవ చేసుకుంటే శని దోషాలు తొలిగి ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో పొందగలరని పండితులు చెబుతున్నారు. కావున భక్తాదులు ఈ మహాశివరాత్రి శుభ పర్వదినాన పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించి ఆ పరమేశ్వరుని కృపకు పాత్రులు కాగలరని కోరుతున్నాము. పూజలో పాల్గొను భక్తులకు పూజా సామాగ్రి ఉచితంగా అందజేయబడును.

# ఎన్టీఆర్ వారసులు సామాన్యుల్లా బ్రతుకుతున్నారు: కొడాలి నాని

అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబు, నారా లోకేష్‌పై మాజీ మంత్రి కొడాలి నాని మండిపడ్డారు. లోకేష్ యాత్రను ప్రజలు పట్టించుకోకపోవడంతో చంద్రబాబుకు పిచ్చిపట్టిందని తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చంద్రబాబు వ్యక్తిగతంగా దూషిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, కొడాలి నాని



శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. మీరు ఇష్టం వచ్చినట్టు వ్యక్తిగతంగా మాట్లాడొచ్చా?. సీఎం వైఎస్ జగన్ డీఎన్ఏ రాయలసీమది.. లోకేష్ డీఎన్ఏ తెలంగాణది. చంద్రబాబు చరిత్ర అందరికీ తెలుసు. తెలంగాణలో పుట్టి, అక్కడే పెరిగి ఇక్కడ యాత్ర చేస్తున్నాడు. ఒక ఎజెండా లేకుండా లోకేష్ యాత్ర చేస్తున్నాడు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఏ రోజూ ప్రాజెక్టులు నిండలేదు. రాష్ట్రానికి పట్టిన దరిద్రం చంద్రబాబు. నేను బూతులు మాట్లాడతాను అనే వాళ్లకి చంద్రబాబు, లోకేష్ మాట్లాడే మాటలు వినిపించడం లేదా?. చంద్రబాబు దండగ అన్న వ్యవసాయాన్ని సీఎం జగన్ పండగ చేశారు. 2 ఎకరాల నుంచి 2 లక్షల ఎకరాలు ఎలా సంపాదించావు?. ఎన్టీఆర్ వారసులు అందరూ సామాన్యుల్లా బ్రతుకుతున్నారు. ఎన్టీఆర్ ఆస్తి అంతా నీకు పంచి ఇచ్చారా?. రైతులను మోసం చేసి, పేదలను సర్వనాశనం చేసిన 420 చంద్రబాబు. ఓ అవినీతి చక్రవర్తి చంద్రబాబు. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచిన సైకో చంద్రబాబు అంటూ సంచలన విమర్శలు చేశారు.

# గిరిజన దంపతులకు సీఎం జగన్ క్షమాపణలు చెప్పాలి



అమరావతి ఫిబ్రవరి 17 : వైసీపీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పై జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ విమర్శలు గుప్పించారు. చనిపోయిన బిడ్డను తరలించేందుకు అంబులెన్స్ అడిగితే ఇవ్వని పాషాణ ప్రభుత్వమని పవన్ కల్యాణ్ మండిపడ్డారు. ఆస్పత్రులను మెరుగుపరచని వైసీపీ పెద్దలు, విశాఖను రాజధానిగా అభివృద్ధి చేసేస్తారట అని పవన్ విమర్శించారు. బిడ్డ మృతదేహంతో 120 కిలోమీటర్ల దూరం మోటార్ సైకిల్‌పై వెళ్లిన ఆ గిరిజన దంపతులకు సీఎం జగన్ క్షమాపణలు చెప్పాలని పవన్ కల్యాణ్ డిమాండ్ చేశారు. కేజీహెచ్‌లో గిరిజనులకు సాయపడేందుకు ఎస్టీ సెల్ ఉన్నా, ఆసుపత్రిలో ఉన్నతాధికారులు ఉన్నా పట్టించుకోకపోవడం అమానవీయమని పవన్ అన్నారు. ఆస్పత్రుల నిర్వహణ, ప్రజారోగ్యంపై పాలకులు ఎంత శ్రద్ధ చూపుతున్నారో అర్థం చేసుకోవచ్చని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ గుర్తు

**జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ డిమాండ్**

చేశారు. ఈ తరహా ఘటన మన రాష్ట్రంలో మొదటిది కాదని, కొద్ది నెలల కిందటే తిరుపతి రుయా ఆసుపత్రి నుంచి బిడ్డ మృతదేహాన్ని తరలించేందుకు ఓ తండ్రిపడ్డ ఆవేదనను రాష్ట్ర ప్రజలు మరచిపోలేదన్నారు. మచిలీపట్నం సముద్ర తీరంలో ఓ బాలుడు చనిపోతే ఆ బిడ్డ మృతదేహాన్ని బంధువులు బైక్ మీద తీసుకువెళ్లారని, ఆసుపత్రుల్లో ఉన్న మహాప్రస్థానం వాహనాల పథకం ఏమైంది? అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. మహాప్రస్థానం వాహనాలే కాదు, అంబులెన్సుల నిర్వహణ కూడా సక్రమంగా ఉండటం లేదని, బెంజి సర్కిల్లో అంబులెన్సులు నిలబెట్టి డ్రోన్ విజువల్స్ తీసి జెండా ఊపితే ప్రయోజనం ఉండదని పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య ఆరోగ్య శాఖకు రూ.14 వేల కోట్ల బడ్జెట్ ఇచ్చామని చెబితే సరిపోదని, ప్రజలకు సేవలు అందాలన్నారు. ఆసుపత్రుల్లో కనీస సదుపాయాలు కల్పించలేని పాలకులు తమ చేతగానితనాన్ని కప్పిపుచ్చుకొనేందుకే విశాఖలో రాజధాని అభివృద్ధి చేస్తామని చెబుతున్నారని, అభివృద్ధి వికేంద్రీకరణ చేస్తామని మాయ మాటలతో ప్రజలను మోసం చేస్తున్నారని పవన్ కల్యాణ్ మండిపడ్డారు. చేతిలో డబ్బు లేక బిడ్డ మృతదేహాన్ని 120 కి.మీ మేర...కాగా విశాఖ జిల్లాలో హృదయవిదారకమైన ఘటన చోటుచేసుకుంది. బిడ్డ మృతదేహాన్ని అంబులెన్స్‌లో తీసుకెళ్లే స్తోమత లేక స్కూటీపై 120 కిలోమీటర్లు తీసుకెళ్లారు. కేజీహెచ్ లో చనిపోయిన బిడ్డను తీసుకెళ్తేందుకు ఆర్థిక స్తోమత లేక ఆ తల్లిదండ్రులు.. అంబులెన్స్ ఏర్పాటు చేయాలని ప్రాధేయపడ్డారు. కానీ ఎంత బతిమాలినా ఆస్పత్రి సిబ్బంది కనికరపడలేదు. ప్రైవేటు అంబులెన్స్‌కు డబ్బులు చెల్లించే పరిస్థితి లేకపోవడంతో గత్యంతరం లేక మృతదేహాన్ని స్కూటీ పై పెట్టుకుని పాడేరు వరకు 120 కిలోమీటర్లు ప్రయాణం చేశారు. అక్కడ విషయం తెలుసుకున్న ఆ ప్రాంత ఆస్పత్రి సిబ్బంది.. పాడేరు నుంచి స్వగ్రామానికి వెళ్లేందుకు అంబులెన్స్ ఏర్పాటు చేశారు. ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డను కోల్పోయామని తల్లిదండ్రులు ఆరోపించారు.

# భాజపాతో పొత్తులోనే ఉన్నామని పవన్ చెప్పారు: సోము వీర్రాజు

చీరాల: మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ చాలా కాలం నుంచి చేస్తున్న ఆరోపణలపై గతంలో స్పందించలేదని.. ఇప్పుడు కూడా స్పందించాల్సిన అవసరం లేదని ఏపీ రాష్ట్ర భాజపా అధ్యక్షుడు సోము వీర్రాజు తేల్చి చెప్పారు. భాజపాలో కార్యకర్తగా చేరి ఇవాళ ఈ స్థాయిలో ఉన్నారని.. తానేంటో పార్టీ అధిష్ఠానానికి తెలుసునని సోము అన్నారు. బాపట్ల జిల్లా చీరాలలో నిర్వహించిన మీడియా సమావేశంలో సోము మాట్లాడారు. కొంతకాలంగా రాష్ట్ర పార్టీలో జరుగుతున్న పరిణామాలపై తీవ్ర అసంతృప్తితో ఉన్న కన్నా.. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజుతో ఇమడలేకే భాజపాను వీడుతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. సోము వీర్రాజు రాష్ట్ర బాధ్యతలు చేపట్టాక పార్టీలో వ్యక్తి పెత్తనం ఎక్కువైపోయిందని.. వర్గాలుగా చీలిపోయేలా వ్యవహరించారని తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేశారు. జనసేనతో పొత్తుపై స్పందిస్తూ.. "విజయవాడలో ఇంద్రకీలాద్రిపై వారాహికి పూజ సమయంలో భాజపా పొత్తులోనే ఉన్నామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించారు. జగన్ వైకాపా ప్రభుత్వానికి 60శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం ఇస్తుంది. అయితే, అన్ని పథకాలకు తామే నిధులు ఖర్చుపెడుతున్నామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పటం శోచనీయం" అని సోము అన్నారు.



# సంపాదకీయం

శనివారం 18-02-2023

## ఆదాయపు పన్ను చెల్లించనవసరం లేని రాష్ట్రం

భారతదేశంలో, భారత పౌరుడు సంపాదించే ఆదాయం మీద ఆదాయ పన్ను చెల్లించాలి. నిర్దిష్ట పరిమితి కంటే ఒక్క రూపాయి ఎక్కువ ఆదాయం ఉన్నా, ఆ వ్యక్తి ఆదాయపు పన్ను పత్రాలు సమర్పించాలి, కట్టాలి. ప్రస్తుతం, మన దేశంలో రెండు రకాల పన్ను విధానాలు అమల్లో ఉన్నాయి. వాటిలో ఒకటి పాత పన్ను విధానం, మరొకటి కొత్త పన్ను విధానం. పాత పన్ను విధానం ప్రకారం రూ. 5 లక్షల ఆదాయం వరకు ఏ వ్యక్తీ ఎలాంటి పన్నూ చెల్లించాల్సిన అవసరం లేదు. అదే విధంగా, కొత్త పన్ను విధానం ప్రకారం, రూ. 7 లక్షల ఆదాయం వరకు ప్రతి వ్యక్తికీ పన్ను మినహాయింపు ప్రయోజనం అందుబాటులో ఉంది. వీటన్నింటి మధ్య, ఒక్క రూపాయి కూడా ఆదాయపు పన్ను చెల్లించని రాష్ట్రం దేశంలోనే ఉందని మీకు తెలుసా?, ఆ రాష్ట్రం గురించి ఇప్పుడు తెలుసుకుందాం.ఆదాయ పన్ను చెల్లించాల్సిన అవసరం లేని రాష్ట్రం పేరు సిక్కిం. దేశంలోని ఈశాన్య ప్రాంతంలో ఉన్న సిక్కిం రాష్ట్రం మన దేశంలో, ప్రపంచంలో పకృతి అందాలకు ప్రసిద్ధి చెందింది. ఈ రాష్ట్రానికి దేశ, విదేశాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. పర్యాటక రంగం రూపంలో ఈ రాష్ట్ర ప్రజలు మంచి ఆదాయం ఆర్జిస్తుంటారు. విశేషం ఏంటంటే... తాము సంపాదించే ఆదాయం మీద ఈ రాష్ట్ర ప్రజలకు మినహాయింపు ఉంది. ఈ రాష్ట్రంలోని 95 శాతం మంది ప్రజలు ఒక్క రూపాయి ఆదాయపు పన్ను కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. దీనికి ఒక కారణం ఉంది.ఆదాయ పన్ను నుంచి మినహాయింపునకు దశాబ్దాల నాటి కారణం ఉంది. ఇండియన్ యూనియన్‌లో సిక్కిం రాష్ట్రం విలీనమైన సమయంలో, భారత ప్రభుత్వంతో ఈ రాష్ట్రం ప్రత్యేక ఒప్పందం చేసుకుంది. ఆ ఒప్పందం ప్రకారం సిక్కిం రాష్ట్ర ప్రజలకు పన్ను చెల్లింపు నుంచి మినహాయింపు సౌకర్యం లభించింది. ఆర్టికల్ 371ం ప్రకారం సిక్కిం రాష్ట్రానికి ప్రత్యేక రాష్ట్ర హోదా వచ్చింది. దీంతో ఇతర రాష్ట్రాల ప్రజలు ఈ రాష్ట్రంలో ఆస్తులు కూడా కొనలేని పరిస్థితి నెలకొంది. అదే సమయంలో, ఈ రాష్ట్రంలోని అసలైన నివాసితులు ఆదాయపు పన్ను 1961లోని సెక్షన్ 10 (26ooo) కింద ఆదాయపు పన్ను చెల్లింపు నుంచి మినహాయింపు ప్రయోజనాన్ని పొందుతున్నారు. రాజ్యాంగంలో ఏ రాష్ట్రానికైనా ప్రత్యేక హోదా ఇవ్వడం గురించి ప్రస్తావించలేదు. ప్రత్యేక హోదా మంజూరు 1969 లో ప్రారంభించబడింది. అప్పుడు 5 వ ఆర్థిక కమిషన్ వెనుకబడిన రాష్ట్రాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం గురించి మాట్లాడారు. ఈ ప్రాధాన్యత కేంద్ర ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం, పన్ను మినహాయింపు రూపంలో ఉంటుంది. ప్రారంభంలో అస్సాం, నాగాలాండ్, జమ్మూ కాశ్మీర్ అనే మూడు రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇచ్చారు. తరువాత మరో ఎనిమిది రాష్ట్రాలు (అరుణాచల్ ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, మిజోరం, సిక్కిం, త్రిపుర, ఉత్తరాఖండ్) కూడా ప్రత్యేక హోదా పొందాయి.ప్రత్యేక హోదా ఇవ్వడం వెనుక ఉన్న కారణం ఏమిటంటే కొన్ని రాష్ట్రాల్లో వనరుల కొరత ఉంది. ఈ రాష్ట్రాలు అభివృద్ధికి వనరులను సమీకరించలేవు. అటువంటి పరిస్థితిలో ఆ రాష్ట్రాలకు సహాయపడేందుకు ప్రత్యేక హోదా ఇవ్వడం జరుగుతుంది. ఏ విషయాలను బట్టి రాష్ట్రానికి ప్రత్యేక హోదా లభిస్తుంది? 2013 లో లోకసభలో అడిగిన ప్రశ్నకు సమాధానంగా ప్రభుత్వం దీనికి ఐదు కారణాలు ఇచ్చింది.జాతీయ అభివృద్ధి మండలి ఏ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలో నిర్ణయిస్తుంది. ఈ కమిటీలో ప్రధానమంత్రి, కేంద్ర మంత్రివర్గం, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రణాళికా సంఘం సభ్యులు ఉన్నారు, కాని ప్రణాళికా సంఘం స్థానంలో ప్రస్తుతం నీతి ఆయోగ్ వచ్చింది. ఆ తరువాత, 14 వ ఆర్థిక కమిషన్ గాడ్గిల్ ఫార్ములా ఆధారిత గ్రాంట్లను నిలిపివేయాలని సూచించింది. ఇవి ప్రత్యేక రాష్ట్రాలకు ఇచ్చిన గ్రాంట్లు. 2015 లో 14 వ ఆర్థిక కమిషన్ సిఫారసులను అమలు చేసిన తరువాత, ప్రత్యేక హోదా అనే భావన దాదాపుగా కనుమరుగైంది.అంటే, ఇప్పుడు మరే రాష్ట్రమైనా అలాంటి హోదా పొందే అవకాశం చాలా తక్కువ. వాస్తవానికి భారత రాజ్యాంగం గురించి మాట్లాడితే, ఏ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వడం గురించి మన రాజ్యాంగం ప్రస్తావించలేదు. ఏదేమైనా, ఆర్టికల్స్ 371, 371 ఎ నుండి 371 జె వరకు రాష్ట్రాలకు అనేక నిబంధనలు ఉన్నాయి.

# 23న టీడీపీలో కన్నా




గుంటూరు, ఫిబ్రవరి 17, కన్నా లక్ష్మీనారాయణ.. గుంటూరులోనే కాదు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే సీనియర్ నేత, వైఎస్, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి క్యాబినెట్‌లో మంత్రిగా కూడా పని చేశారు. ఒకానొక దశలో ముఖ్యమంత్రి జాబితాలో కూడా కన్నా పేరు వినిపించింది. అంతటి సీనియర్ నేత పరిస్థితులు, మారిన రాజకీయాల కారణంగా కాంగ్రెస్‌ను వీడి బీజేపీలోకి వచ్చారు. వచ్చీరాగానే ఏకంగా ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా కూడా పని చేశారు. అలాంటి వ్యక్తి ఇప్పుడు బీజేపీకి కూడా రాజీనామా చేసి తర్వాత ఏ పార్టీలో చేరుతారనే చర్చ జోరుగా సాగుతోంది. కన్నా లక్ష్మీనారాయణ తెలుగుదేశం వైపు మొగ్గుతున్నారని అనుచరులు చెబుతున్నారు. ఈ మధ్య కాలంలోనే కాపు రిజర్వేషన్ల అంశం వచ్చినప్పుడు చంద్రబాబును పొగిడారు కన్నా లక్ష్మీనారాయణ. బీజేపీ తీరుపై కన్నా లక్ష్మీనారాయణ అసంతృప్తిగా ఉన్నారనే సమాచారం అందుకున్న పార్టీ ఆయన్ని ఆహ్వానించడానికి క్యూ కట్టారు. అలా ఆహ్వానించిన పార్టీల్లో టీడీపీ, జనసేన, వైసీపీ ఉన్నాయి. ఆయన మాత్రం అన్ని అంచనాలు వేసుకున్న తర్వాత... అనుచరులతో మాట్లాడిన తర్వాత ఓ నిర్ణయానికి వచ్చారని సన్నిహితులు చెబుతున్నారు. ఇటీవల విశాఖలో కాపు సంఘాల నేతృత్వంలో జరిగిన సమావేశంలో జీవీఎల్ నరసింహారావుకు సన్మానం చేశారు. పార్లమెంట్‌లో కాపు రిజర్వేషన్ల అంశంపై జీవీఎల్ ఓ ప్రశ్న వేశారని ఈ సన్మానం చేశారు. కేంద్రం తెచ్చిన పది శాతం ఈడబ్ల్యూఎస్ కోటా రిజర్వేషన్లలో ఐదు శాతం కాపులకు కేటాయిస్తూ చంద్రబాబు ప్రభుత్వం చట్టం చేసింది. ఇక సర్టిఫికెట్లు జారీ చేయడమే మిగిలి ఉన్న సమయంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆ రిజర్వేషన్లు చెల్లవని క్యాన్సిల్ చేసింది. ఈ అంశంపై పార్లమెంట్‌లో జీవీఎల్ ఓ ప్రశ్న అడిగారు. చంద్రబాబు హయాంలో ఇచ్చిన కాపు రిజర్వేషన్లు చెల్లుతాయా అని ప్రశ్నించారు. అవి చట్టబద్దంగానే ఉన్నాయని చెల్లుతాయని కేంద్రం సమాధానం ఇచ్చింది. అలా తాను ప్రశ్న అడిగినందుకే ఆ సమాధానం వచ్చిందని జీవీఎల్ నరసింహారావు కాపు సంఘాలతో సన్మానాలు చేయించుకున్నారని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. ఇది కన్నా లక్ష్మీనారాయణకు కోపం తెప్పించిందని చెబుతున్నారు. దీనిపై మాట్లాడిన కన్నా లక్ష్మీనారాయణ వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాపు రిజర్వేషన్ల అంశాన్ని తెరపైకి తెచ్చారని.. ఆర్థిక, సామాజిక పరిస్థితులపై అధ్యయనం చేశారన్నారు. చంద్రబాబు ఈ రిజర్వేషన్లను పూర్తి చేశారన్నారు. చంద్రబాబు ఇచ్చిన రిజర్వేషన్లను ప్రభుత్వం తొలగించిందని.. కన్నా చెప్పకనే చెప్పారు. ఈడబ్ల్యూఎస్ కోటా కిందకాపులకు రిజర్వేషన్లు పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. జనసేన విషయంలో బీజేపీ నేతలు చేస్తున్న ప్రకటనలపైనా కన్నా అభ్యంతరం వ్యక్తం చేశారు. జనసేన పార్టీ అధినేత పవన్ .. తన నిర్ణయాలను తాను తీసుకోనివ్వాలని ఇతరులు ప్రభావితం చేసే ప్రయత్నం చేయవద్దని సూచించారు. ఆయన నిర్ణయం ఆయన తీసుకుంటారని స్పష్టం చేశారు. "సోము వీర్రాజు ప్రవర్తన నచ్చకే పార్టీని వీడుతున్నా. ఆయన వల్లే పార్టీలో ఇమడలేకపోయా. పార్టీతో చర్చించకుండా జీవీఎల్ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. రంగా పేరు క్రిష్ణా జిల్లాకు పెట్టాలని గతంలోనే ఉద్యమం చేశాం. అప్పుడే జీవీఎల్ ఉద్యమంలో పాల్గొంటే బాగుండేది. కొందరు ఓవర్ నైట్ స్టార్ నేత కావాలని ప్రయత్నిస్తున్నారు. సోము వీర్రాజు అధ్యక్షుడు అయ్యాక పార్టీలో పరిస్థితులు మారాయి" -కన్నా లక్ష్మీ నారాయణ

# త్వరలో టీటీడీ చిన్నారుల ఆస్పత్రి సేవలు

తిరుపతి, ఫిబ్రవరి 17, చిన్న పిల్లల కోసం టీటీడీ నిర్మిస్తోన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అతి త్వరలో అందుబాటులోకి వస్తుందని ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. ఈ ఆసుపత్రిలో అవయవ మార్పిడికి సకల సదుపాయాలతో పాటు ఎయిర్ అంబులెన్స్ సదుపాయాన్ని కూడా ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో తొలి చిన్న పిల్లల గుండె మార్పిడి ఆపరేషన్ చేయించుకున్న విశ్వేశ్వర్ ను టీటీడీ ఛైర్మన్ పరామర్శించారు. చిన్నారికి వైద్య చికిత్స అందించిన వైద్యులను వైవి సుబ్బారెడ్డి అభినందించారు.రాష్ట్రంలో పేద పిల్లల ప్రాణాలు కాపాడటానికి ? వేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో రూ 250 కోట్లతో నిర్మిస్తున్న చిన్న పిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకుని వస్తామని టీటీడీ ఛైర్మన్ చెప్పారు. ఈ ఆసుపత్రిలో అవయవ మార్పిడికి అవసరమైన అన్ని సదుపాయాలతోపాటు హెలిపాడ్ కూడా నిర్మిస్తామని తెలిపారు.శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయం - గుండె చికిత్సల ఆసుపత్రిలో జనవరి 20వ తేదీన రాష్ట్రంలోనే తొలి చిన్న పిల్లల గుండె మార్పిడి ఆపరేషన్ ను విజయవంతంగా నిర్వహించారు. అన్నమయ్య జిల్లా చిట్వేల్ మండలం కెఎస్ ఆర్ అగ్రహారం కు చెందిన 15 సంవత్సరాల విశ్వేశ్వర్ కు వైద్యులు ఈ ఆపరేషన్ చేశారు. టీటీడీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, జేఈవో సదా భార్గవితో కలసి ఆసుపత్రిలో విశ్వేశ్వర్ తో పాటు అతని తల్లి రాధమ్మను పరామర్శించారు.గుండె మార్పిడి ఆపరేషన్ లో పాల్గొన్న వైద్య బృందంతో ఆపరేషన్ జరిగిన విధానం పై మాట్లాడారు. రాష్ట్రంలో చిన్న పిల్లలకు ప్రత్యేకంగా ఆసుపత్రి లేని లోటు తీర్చాలని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. 2021 అక్టోబర్ 11వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా శ్రీ పద్మావతి చిన్న పిల్లల గుండె ఆసుపత్రి ప్రారంభించామని తెలిపారు.75 పడకలు గల ఆసుపత్రిలో ఐసియు పడకలు, 3 మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు, అధునాతన క్యాథ్ ల్యాబ్ ఉన్నాయన్నారు. డా.వై.ఎస్.ఆర్.ఆరోగ్యశ్రీ, ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన పథకాల కింద కేవలం 15 నెలల కాలంలోనే 1110 మంది చిన్న పిల్లలకు గుండె శస్త్రచికిత్సలు ఉచితంగా చేసినట్లు శ్రీ సుబ్బారెడ్డి చెప్పారు.విశ్వేశ్వర్ కు గుండె పూర్తిగా దెబ్బతిన్నందువల్ల గుండె మార్పిడి చేయాల్సి ఉందని చిన్నపిల్లల గుండె ఆసుపత్రి వైద్యులు నిర్ణయించారన్నారు. విశాఖపట్నంలో బ్రెయిన్ డెడ్ అయిన మహిళ గుండెను దానం చేయడానికి కుటుంబసభ్యులు సిద్ధంగా ఉన్నారని జీవన్ దాన్ ద్వారా తెలుసుకుని వారితో సంప్రదించారన్నారు.బాలుడి ప్రాణాలు కాపాడాలనే పట్టుదలతో వైద్యులు తిరుపతి నుండి కారులో విశాఖ వెళ్ళి అక్కడ గుండె తీసుకుని విమానంలో నాలుగు గంటల్లోగా ఆసుపత్రికి తీసుకుని వచ్చి విశ్వేశ్వర్ కు అమర్చారని తెలిపారు.చిన్నపిల్లల గుండె ఆసుపత్రి డైరెక్టర్డాక్టర్ ఎన్.శ్రీనాథ్ రెడ్డి - సీనియర్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ ఆధ్వర్యంలో సీనియర్ పీడియాట్రిక్ సి.టి. సర్జన్ డాక్టర్ కె.గణపతి సుబ్రమణ్యం, పీడియాట్రిక్ ఇంటెన్సివ్ అనస్థీటిస్ట్ డాక్టర్ ఎ.మధు యాదవ్, జీవన్ దాన్ రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ రాంబాబు బృందంతో ఇతర వైద్య నిపుణులు,సిబ్బంది శ్రమించి ఈ ఆపరేషన్ విజయవంతం చేశారని ఛైర్మన్ అభినందించారుగుండె తరలింపు కోసం విశాఖ పట్నం,తిరుపతి జిల్లా యంత్రాంగం సమన్వయంతో ఎయిర్‌పోర్టు నుండి ఆసుపత్రి వరకు ప్రత్యేక గ్రీన్‌కారిడార్ ఏర్పాటుచేసి నిర్దేశిత వ్యవధిలో గుండెను తీసుకొచ్చేలా కృషి చేసిన వారందరినీ అభినందించారు. మరో నాలుగైదు రోజుల్లో విశ్వేశ్వర్ ను డిశ్చార్జ్ చేస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బర్డ్ ఆసుపత్రి ప్రత్యేకాధికారి డాక్టర్ రెడ్డెప్ప రెడ్డి , చిన్నపిల్లల గుండె ఆసుపత్రి ఆర్ ఎం ఓ డాక్టర్ భరత్ తో పాటు ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

# 15 ఏళ్లుగా ముందుకు సాగని కరకట్ట పనులు

శ్రీకాకుళం, ఫిబ్రవరి 17 15 ఏళ్ల క్రితం ప్రారంభమైన వంశధార, నాగావళి కరకట్టల నిర్మాణ పనులు నేటికీ ఒక కొలిక్కి రాలేదు. అధికార మార్పిడి జరుగుతున్న ప్రతి సందర్భంలోనూ నిర్మాణ సంస్థలు మారడటంతో కరకట్టల కథ మళ్లీ మొదటికే వస్తోంది. 2007లో కాంగ్రెస్ పార్టీ హయాంలో మొదలైన పనులు ఏ దశలో నిలిచిపోయాయో అదే స్థితిలో ఉన్నాయి. టిడిపి ప్రభుత్వం కొత్త నిర్మాణ సంస్థలకు పనులు అప్పగించడం, అంచనా వ్యయం పెంపు ప్రతిపాదనలకు ఆమోదం తెలపడంతోనే సరిపెట్టింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం తొలుత వరద ముప్పు తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించాలని ఆదేశించింది. ప్రభుత్వ సూచనలకనుగుణంగా 2021 మేలో అధికారులు ప్రతిపాదనలు పంపినా నేటికీ ఆమోదం తెలపలేదు. వేసవి నేపథ్యంలో పనులు చేపట్టేందుకు అనువైన కాలం కావడంతో ప్రభుత్వం అనుమతి కోసం అధికారులు వేచిచూస్తున్నారు.వంశధార నదిపై నిర్మించాల్సిన కరకట్టలను నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. మొదటి ప్యాకేజీ పనిని 2007 ప్రారంభంలో రూ.44.77కోట్లతో ప్రారంభించారు. 2010 జూన్ నాటికి సంబంధిత నిర్మాణ సంస్థ ఏడు శాతం మాత్రమే పనిచేసి నిలుపుదల చేసింది. ప్యాకేజీ-2 పనులను అదే సంస్థ రూ.27.29 కోట్లతో పనులను దక్కించుకుంది. పనులను 2007లో ప్రారంభించి, 2011 మార్చి నాటికి 5.66 శాతం పనులను పూర్తి చేసి మిగిలిన పనిని చేయలేమంటూ చేతులెత్తేసింది. ప్యాకేజీ-3 పనులను కూడా 2007 ప్రారంభంలో రూ.49.16 కోట్లతో ప్రారంభించారు. 2010 జులై నాటికి 2.45శాతం పనులు పూర్తి చేసి, అర్ధాంతరంగా విడిచిపెట్టేసింది. మూడు ప్యాకేజీలకు ఒకే నిర్మాణ సంస్థ పని దక్కించుకోగా, ప్యాకేజీ-4 పనులను వేరే నిర్మాణ సంస్థ చేజిక్కుంచుకుంది. 2009లో రూ.56.60 కోట్లకు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థ 21.34 శాతం పనులు పూర్తి చేసి అర్ధాంతరంగా విడిచిపెట్టేసింది. ఆయా నిర్మాణ సంస్థలు ఎంత మేర పనులు చేసి ఆపేశాయో అక్కడ నుంచి నేటి వరకు అదనంగా ఒక్క శాతం పనులు కూడా జరగలేదు. కరకట్టల నిర్మాణానికి పెద్ద ఎత్తున భూమిని సేకరించాల్సి ఉండటం, భూసేకరణకు అధికంగా నిధులు వెచ్చించాల్సి రావడంతో ప్రభుత్వం ఉన్న పళంగా కరకట్టలను ఆపేసింది.నాగావళి నదిపై నిర్మిస్తున్న కరకట్టలు కూడా అసంపూర్తిగానే ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాలో నిర్మిస్తున్న కరకట్టలను ప్యాకేజీగా పనులుగా చేపడుతున్నారు. హైదరాబాద్‌కు చెందిన గాయత్రి ప్రాజెక్ట్స్ సంస్థ రూ.61.45 కోట్లకు పనులను దక్కించుకుంది. 2008లోనే పనులను ప్రారంభించింది. ఇప్పటికి కూడా పనుల్లో పెద్దగా పురోగతి కనిపించడం లేదు. జిల్లా పరిధిలో 51.88 కిలోమీటర్ల మేర వరద కట్ట నిర్మించాల్సి ఉండగా ఇప్పటివరకు 17.29 కి॥మీ పొడవు మేర మాత్రమే పని పూర్తయింది. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 25 శాతం కంటే తక్కువ ఖర్చు చేసి పనులను తాత్కాలికంగా నిలిపివేయాలంటూ మే 29, 2019న ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అధికారులు ఎక్కడి పనులను అక్కడే నిలిపేశారు.వంశధార, నాగావళి నదుల వరదల నుంచి అధిగమించడానికి గతంలో కరకట్టల పనులను ప్రారంభించినా ఫలితం లేకపోయింది. 2009-10 మధ్య కాలం వరకు కాస్తాకూస్తో పనులు జరిగినా ఆ తర్వాత నుంచి ఒక్క అడుగు కూడా ముందుకు పడటం లేదు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం 25శాతంలోపు ఖర్చయిన పనులను నిలిపేసి వరద ముప్పు తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించాలంటూ అధికారులను ఆదేశించింది. ముంపు తీవ్రత అధికంగా ప్రాంతాలను గుర్తించి అందులో ముఖ్యమైన పనులకు ప్రాధాన్యమివ్వాలన్న ప్రభుత్వ ఆదేశాలతో నాగావళి కరకట్టలకు సంబంధించి అధికారులు తొలుత ఐదు ప్రాంతాలను గుర్తించారు. వాటిలో కరకట్టల నిర్మాణానికి రూ.119 కోట్లు అవసరం అవుతాయని అధికారులు ప్రతిపాదించారు. అదే విధంగా వంశధారపై 22.77 కి.మీ మేర కరకట్టలను నిర్మించేందుకు రూ.126 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. నాగావళి, వంశధార నదులపై వరద ముంపు తీవ్రంగా ఉన్న ప్రాంతాలపై ప్రతిపాదనలు పంపి ఏడాదన్నర గడుస్తున్నా ప్రభుత్వం నేటికీ ఆమోదం తెలపలేదు.

# ఏపీ బీజేపీలో మాస్ లీడర్ల కొరత !

విజయవాడ, ఫిబ్రవరి 17,ఆంధ్రప్రదేశ్ బీజేపీకి కన్నా లక్ష్మినారాయణ రాజకీనామా చేశారు. కొన్నాళ్లుగా ఆయన పార్టీపై అసంతృప్తితో ఉన్నారు. కానీ ఎవరూ పట్టించుకోలేదు. ఏపీ బీజేపీ చీఫ్ గా పని చేస్తూండగా హఠాత్తుగా ఆయనకు ఉద్వాసన చెప్పారు. తర్వాత రాజకీయాల్లో ఉన్నారా లేరా అన్నట్లుగా ఆయన కనిపించడం మానేశారు. బీజేపీలో ఆయనకు ఎక్కడా ప్రాధాన్యం దక్కలేదు. జాతీయ కార్యవర్గంలో సభ్యత్వం ఇవ్వడం మినహా రాష్ట్ర రాజకీయాల్లో ఆయనకు పాత్ర లేకుండా చేశారు. దీంతో ఆయన చివరికి పార్టీకి గుడ్ బై చెప్పారు. అయితే ఈ విషయంలో హైకమాండ్ కూడా కన్నాను పార్టీలోనే ఉంచడానికి పెద్దగా ఎలాంటి ప్రయత్నాలు చేయలేదు. ఈ విషయం కూడా చర్చనీయాంశం అవుతోంది. తెలంగాణలో జోరుగా ఉన్న పార్టీ.. ఏపీలో ఎందుకు ముందుకు వెళ్లలేకపోతోంది ? ఏపీ విషయంలో హైకమాండ్ ఇంకా జాతీయ రాజకీయాలనే చూసుకుంటోందా ?రాజకీయ పార్టీకి ఓ మాస్ లీడర్ ఉన్నప్పటికీ రాష్ట్రాలు, జిల్లాలు, నియోజకవర్గాల్లో కూడా మాస్ లీడర్లు ఉండాలి. లేకపోతే పార్టీ బలోపేతం కాదు. బీజేపీకి జాతీయ స్థాయిలో నరేంద్రమోదీ ఉన్నారు. కానీ రాష్ట్ర స్థాయిలో అసలు ఎవరూ లేరు. ఏపీ బీజేపీలో ప్రత్యక్ష ఎన్నికల్లో గెలిచిన నాయకుడు ఒక్కరంటే ఒక్కరు లేరు. ఎమ్మెల్యే స్థానం కాదు కదా.. చివరికి వారి స్వగ్రామాల్లో లేదా వార్డుల్లో బీజేపీ అభ్యర్థిగా నిలబడితే గెలుస్తారన్న గ్యారంటీ ముఖ్య నేతలకూ లేదు. సోము వీర్రాజు, జీవీఎల్ నరసింహారావు లాంటి నేతలు కేవలం మీడియాలో మాత్రం ప్రముఖులు. వారికి జనాల్లో ఉన్న క్రేజ్ తక్కువ. అది ఎన్నికల్లో పోటీ చేయడానికి సరిపోదు. అయితే విచిత్రంగా పార్టీ వారి చేతుల్లోనే ఉంది. ఎన్నికల తర్వాత కేసుల భయమో.. భద్రత భయమో.. కారణం ఏదైనా కొంత మంది మాస్ లీడర్లు బీజేపీలో చేరారు. కన్నా లక్ష్మినారాయణ ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. పదిహేనేళ్లు మంత్రిగా ఉన్నారు. అలాంటి నేత సారధ్యంలో చాలా మంది నేతలు ఇతర పార్టీల నుంచి వచ్చి చేరారు. రాయలసీమలో ఆదినారాయణ రెడ్డి, వరదాపురం సూరి, బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, కర్నూలు ఎంపీ టీజీ వెంకటేష్ వంటి వారు చేరారు. కోస్తా.. ఉత్తరాంధ్రల నుంచి కూడా చేరారు. అయితే ఇలా చేరిన వారందర్నీ పక్కన పెట్టేసింది బీజేపీ హైకమాండ్. కన్నాను పార్టీ అధ్యక్ష పదవి నుంచి తొలగించిన తర్వాత అలా పార్టీలో చేరిన వారందర్నీ పక్కన పెట్టేశారు. ఫలితంగా వారంతా పక్క చూపులు చూస్తున్నారు. వచ్చే ఎన్నికల నాటికి బీజేపీలో ఉన్న మాస్ లీడర్లంతా పార్టీలో ఉండటం కష్టమేనన్న వాదన వినిపిస్తోంది. సోము వీర్రాజు ఏం చేసినా హైకమాండ్ ఆదేశాలతోనే చేశారని జీవీఎల్ నరసింహారావు ప్రకటించారు.

# జయమంగళానికి ఎమ్మెల్సీ పదవీ

విజయవాడ, ఫిబ్రవరి 17, రాజకీయాల్లో ఏ పార్టీ తరపున పని చేస్తే ఆ పార్టీ తరపునే అవకాశాలు రావాలన్న నిబంధనేమీ లేదు. ఏ పార్టీపైన పోరాడారో ఆ పార్టీనే పిలిచి అవకాశం ఇచ్చే చాన్స్ ఉంది. ఇది రాజకీయాల్లో సహజమే. ఇలాంటి అవకాశం తాజాగా తెలుగుదేశం పార్టీ తరపున కైకలూరు నియోజకవర్గానికి ఇంచార్జ్ గా వ్యవహరిస్తున్న జయమంగళ వెంకటరమణకు లభించింది. ఆయన తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసి వైఎస్ఆర్‌సీపీలో చేరారు. 2009లో కైకలూరు నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన వెంకటరమణ, ప్రస్తుతం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్‌గా కొనసాగుతున్నారు. బుధవారమే టీడీపీ సభ్యత్వానికి, కైకలూరు టీడీపీ ఇంచార్జ్ పదవికి రాజీనామా చేశారు. జయమంగళ వెంకట రమణతో పాటు ము టీడీపీ రైతు విభాగం నాయకుడు సయ్యపరాజు గుర్రాజు కూడా వైఎస్ఆర్‌సీపీలో చేరారు. పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. జయ మంగళ వెంకటరమణకు.. సీఎం జగన్ ఎమ్మెల్సీ స్థానం ఆఫర్ ఇచ్చారు. ప్రస్తుతం పదమూడు ఎమ్మెల్సీ స్థానాలకు షెడ్యూల్ విడుదల అయింది. వీటిలో ఐదు స్థానాలు గ్రాడ్యుయేట్, టీచర్ నియోజకవర్గాలకు జరుగుతున్నాయి. వీటికి అభ్యర్థులను సీఎం జగన్ ఇటీవలే ఎమ్మెల్యేల సమావేశంలో ప్రకటించారు. ఇంకా స్థానిక సంస్థల కోటాలో జరగాల్సిన ఎనిమిది ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థుల్ని ప్రకటించాల్సి ఉంది. ఈ ఎనిమిదింటిలో ఒక స్థానాన్ని జయ మంగళ వెంకటరమణకు సీఎం జగన్ కేటాయించినట్లుగా తెలుస్తోంది. స్థానిక సంస్థల కోటాలో 23న నామినేషన్ వేయనున్నట్లుగా జయమంగళ వెంకటరమణ అనుచరులు చెబుతున్నారు. అయితే ఇంత కాలం టీడీపీ కోసం పని చేసి ఇప్పుడు వైసీపీలో చేరగానే ఆయనకు ఎమ్మెల్సీ అవకాశం కల్పిస్తున్నారని.. మరి పార్టీ కోసం పని చేసిన వారికి ఎందుకు ప్రాధాన్యం ఇవ్వడం లేదన్న అసంతృప్తి ఆ పార్టీలో కనిపించే అవకాశం ఉంది. దీన్ని సర్దుబా?ట చేసేందుకు వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నేతలు .. ఆశావహులతో చర్చలు జరుపుతున్నారు. గత ఎన్నికలకు ముందు సీఎం జగన్ పలువురు పార్టీ నేతలకు ఎమ్మెల్సీ ఆఫర్లు ఇచ్చారు. టిక్కెట్లు ఇవ్వలేకపోయిన వారికి.. అలాగే ఎన్నికల సమయంలో పార్టీలో చేరిన వారికి ఈ ఆఫర్లు ఇచ్చారు. ఎస్వీ మోహన్ రెడ్డి, మర్రి రాజశేఖర్, బుట్టా రేణుక సహా ఇలాంటి నేతలు చాలా మంది తమకు అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. అయితే ఎన్ని సార్లు ఎమ్మెల్సీ స్థానాలుకు భర్తీ చేసే అవకాశం వచ్చినా.. ఇతర పార్టీల నుంచి వచ్చిన వాళ్లకు అవకాశం కల్పిస్తూండటంతో వీరికి నిరాశ తప్పడం లేదు.

# గృహసారధులు వర్సెస్ సాధికారిక సారధులు

కాకినాడ, ఫిబ్రవరి 17,తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు సొంత పార్టీలో కొత్త వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నట్లుగా ప్రకటించారు. ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా జగ్గంపేటలో పర్యటిస్తున్న చంద్రబాబు కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కీలక ప్రకటన చేశారు. ప్రతి ముప్ఫై ఇళ్లకు టీడీపీ తరపున ఓ సాధికార సారధిని నియమించాలని నిర్ణయించారు. వైసీపీ ప్రభుత్వం ప్రతి యాభై ఇళ్లకు ఓ వాలంటీర్ ను నియమించింది. తర్వాత పార్టీ తరపున అంటూ గృహసారధుల్ని నియమించింది. వీరిలో వాలంటీర్లకు ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం చెల్లిస్తున్నారు. రూ. ఐదు వేల వేతనానికి వాలంటీర్లు పని చేస్తున్నారు. వీరికి పెద్దగా పని ఉండనప్పటికీ.. ప్రతి యాభై ఇళ్ల వివరాలు.. ఆ కుటుంబాలకు సంబంధించిన సమస్త సమాచారం వారి దగ్గర ఉంటుంది. ఇది రాజకీయంగా కూడా ఎంతో కీలకమని భావిస్తున్నారు. అయితే ఎన్నికల సమయంలో వీరిపై ఆంక్షలు ఉండే అవకాశం ఉన్నందున పార్టీ తరపున గృహసారధుల్ని సీఎం జగన్ నియమించారు. వారికి తోడు సచివాలయ కన్వీనర్ల వ్యవస్థను కూడా తీసుకు వచ్చారు.ఇప్పుడు వారికి కౌంటర్‌గా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సాధికార సారధుల్ని నియమించాలని నిర్ణయించారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పనులు చేయించుకోలేకపోయమని కొంత మంది కార్యకర్తలు బాధపడ్డారని.. ఈ సారి మాత్రం ప్రత్యేక వ్యవస్థ పెట్టి .. అందరికీ న్యాయం చేస్తానని చంద్రబాబు భరోసా ఇచ్చారు. ఏ కార్యకర్తకు పని అవసరం అయినా .. పక్కా వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నట్లు చంద్రబాబు చెప్పారు. ఇకపై పార్టీలో ఉన్న సెక్షన్ ఇన్‌ఛార్జ్‌లందరినీ కుటుంబ సాధికార సారథులుగా పిలుస్తామన్నారు. ఆర్థిక అసమానతలు తొలగించేలా వీళ్లు పనిచేస్తారని వివరించారు. సాధికార సారథులుగా మహిళలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. ప్రతి నియోజకవర్గంలో కుటుంబ సాధికార సారథి విభాగం ఉంటుందని చెప్పారు. గతంలో రాజకీయ పార్టీల వ్యవస్థలు బూత్ స్థాయి వరకే ఉండేవి. బూత్ కమిటీల్లో ఉండే నేతలే దిగువ స్థాయి నేతలు., మిగతా వారంతా కార్యకర్తలు. ఇప్పుడు మరింత మైక్రో లెవల్‌కి రాజకీయ పార్టీలు తమ కార్యకలాపాల్ని తీసుకెళ్తున్నాయి. వైఎస్ఆర్‌సీపీ ఈ విషయంలో ట్రెండ్ సెట్టర్‌గా నిలిచింది. వాలంటీర్లతో ఆ పార్టీ గరిష్ట రాజకీయ ప్రయోజనం పొందుతోందన్న విమర్శలు ఉన్నాయి. చివరికి వాలంటీర్లకు దినపత్రిక కొనుగోలుకు కూడా డబ్బులిస్తున్నారు. ఈ విధంగానూ లబ్ది పొందుతున్నారని చెబుతున్నారు. ఇప్పుడు టీడీపీ కూడా ఆ దిశగానే అడుగులు వేస్తోంది.

# తీవ్ర ఇబ్బందులు పడుతున్న భోగాపురం నిర్వాసితులు

విజయనగరం, ఫిబ్రవరి 17, ప్రభుత్వ నిర్వాకంతో భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్వాసితులు చెల్లాచెదురవుతున్నారు. ఎక్కడ తలదాచుకోవాలో ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక సతమతమవుతున్నారు. ఇటువంటి తరుణంలో కొంతగడువు ఇవ్వాల్సిన అధికార యంత్రాంగం ఇళ్లు ఖాళీ చేయకపోతే తామే కూల్చేస్తామంటూ బెదిరిస్తూ పోలీసులను మోహరింపజేయడంతో బాధితులంతా బిక్కుబిక్కుమంటూ మూటాముల్లె సర్దుకుంటున్నారు. తమపై ప్రభుత్వం నుంచి తీవ్ర ఒత్తిడి ఉందని, ఇటువంటి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గే ప్రశ్నేలేదని అధికారులు చెప్తున్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు కోసం సుమారు 2,700 ఎకరాలు భూమిని సేకరించిన విషయం విదితమే. ఇందులో భాగంగా మరడపాలెం, బొల్లెంకులపాలెం, ముడసర్లపాలెం, రెల్లిపేట గ్రామాలు పూర్తిగా ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మొత్తం 367 నిర్వాసిత కుటుంబాలను అధికారులు గుర్తించారు. గూడెపువలస, లింగాలవలస రెవెన్యూ పరిధిలో స్థలాలు కేటాయించింది. భూములు, ఇళ్లు, చెట్లకు నష్టపరిహారంతోపాటు ప్రతి కుటుంబానికీ ఐదు సెంట్ల స్థలం, 9.50 లక్షల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కల్పిస్తామని 2015లో అప్పటి ప్రభుత్వం తెలిపింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కల్పనకు అదుగో ఇదిగో అంటూ నెట్టుకొస్తూ 2021లో మంజూరు చేసింది. తొలుత ఒప్పందం కుదిరిన సమయంలో ఆయా గ్రామాల్లో చాలామంది ఉపాధి కోసం వలస వెళ్లడంతో నాయకులుగానీ, అధికారులుగానీ వారిని గుర్తించలేదు. దీంతో, మరడపాలేనికి చెందిన నీలాపు నర్సయ్యమ్మ, నీలాపు అప్పయ్యమ్మ, నీలాపు అప్పన్న, నీలాపు సునీత, నీలాపు చిన అప్పయ్యమ్మలతోపాటు సుమారు 34 మంది పునరావాసానికి నోచుకోలేదు. మిగిలిన మూడు గ్రామాల్లో కూడా ఇటువంటి వారు మరికొందరు ఉన్నారు. వీరంతా తమకు స్థలాలు కేటాయించాలని చాలాకాలంగా అడుగుతున్నా అధికారులు పట్టించుకోలేదు. తాజాగా బలవంతంగా ఖాళీ చేయించేందుకు వచ్చిన అధికారులను నిలదీయడంతో ఆర్ అండ్ ఆర్ చట్టంతో సంబంధం లేకుండా 1.5 సెంట్ల చొప్పున స్థలాలు ఇస్తామని అధికారులు చెబుతున్నారు. తమకు కూడా అందరితోపాటు ఐదు సెంట్ల స్థలాలు ఇవ్వాలని వారు కోరుతున్నారు. భూములు తీసుకోవడానికి మాత్రం స్థానికులమనే ధ్రువీకరణ పత్రాలు అడగలేదని, అందరితోపాటు స్థలాలు, ఇళ్ల కట్టుకోవడానికి డబ్బులు అడిగితే స్థానికతతో కూడిన ఆధార్ కార్డులు చూపించమంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆధార్ కార్డుల్లో స్థానిక చిరునామాలు లేకపోవడం వల్ల ప్యాకేజీ వర్తింపజేయలేమని అధికారులు ఖరాఖండిగా చెబుతున్నారు. మరడపాలెంలో రేషన్, ఆధార్ కార్డులు ఉన్నా కొంతమందికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింప జేయలేదు. ఇదే గ్రామానికి చెందిన కొండపు రమేష్ చదువు కోసం తల్లిదండ్రులు వేరొక ఊరు వెళ్లారు. గ్రామంలో సొంత ఇల్లు, పొలం కూడా ఉంది. వాటికి ప్రభుత్వం నష్టపరిహారం కూడా ఇచ్చింది. జాబితా తయారీ సమయంలో గ్రామంలో లేరన్న నెపంతో ఆర్‌అండ్‌ఆర్ వర్తింపజేయలేదు. కొండపు కొండమ్మ, భైరెడ్డి అసిరమ్మ, బూస నరసమ్మ సహా ఈ గ్రామంలో 11 కుటుంబాలు ఇదే సమస్యతో సతమతమవుతున్నాయి. ఆర్ అండ్ ఆర్ చట్టం ప్రకారం గ్రామాలు ఖాళీ చేయించిన నాటికి 18 ఏళ్లు దాటిన వారికి కూడా ఐదు సెంట్ల ఇంటి స్థలం, నిర్మాణానికి రూ.9.50 లక్షల చొప్పున ఇస్తామని 2015లో ప్రభుత్వ యంత్రాంగం హామీ ఇచ్చింది. ఆచరణలో అప్పట్లో గుర్తించిన 18 ఏళ్ల పైబడిన యువతకు మాత్రమే ప్యాకేజీ అమలు చేసింది. దీంతో, ఒక్క మరడపాలెంలోనే సుమారు 20 మంది యువతీ, యువకులు ఆర్‌అండ్‌ఆర్‌కు నోచుకోలేదు. తనకు 2015 నాటికే 18 ఏళ్లు దాటాయని, ప్యాకేజీ గురించి అడిగితే అధికారులు స్పందించడం లేదని మరడపాలేనికి చెందిన కొండపు నర్సింగరావు 'ప్రజాశక్తి' ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. కొండపు రమణ సహా 18 ఏళ్ల నిండిన చాలామంది యువతీ, యువకులు గ్రామంలో ఉన్నారుఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పొందినవారూ అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. ఒప్పందం కుదిరిన ఆరేళ్ల తరువాత అంటే 2021లో ప్రభుత్వం డబ్బులు విడుదల చేసింది. ఈలోపు నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిపోవడంతో ఇంటి నిర్మాణ వ్యయం పెరిగింది. దీంతో, వివిధ స్థాయిల్లో నిర్మాణాలు నిలిచిపోయాయి. లింగాలవలస పునరావాస కాలనీలో మరడపాలేనికి చెందిన 70 ఇళ్ల నిర్మాణాన్ని స్థానిక వైసిపి నాయకుడు కాంట్రాక్టు తీసుకున్నారు.

# దళిత ఆత్మగౌరవ పతాక భాగ్యరెడ్డి వర్మ

## -నేడు భాగ్యరెడ్డి వర్మ వర్ధంతి

దళితులు పంచములు కాదు.. ఆది హిందువులు అంటూనే జోగిని, దేవదాసి వంటి దురాచారాలను రూపుమాపేందుకు భాగ్యరెడ్డి వర్మ ఉద్యమించారు. మన్యం సంఘాన్ని స్థాపించి దళితుల్లో చైతన్యం తెచ్చారు. జగన్ మిత్ర మండలి పేరిట దళిత బాలబాలికలకు విద్య నేర్పించారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడ్డారు. పలు సేవా కార్యక్రమాలతో దళిత జనోద్ధారకుడిగా, సంఘ సంస్కర్తగా, వైతాళికుడిగా నిలిచారు.. భాగ్యరెడ్డి వర్మ. మాదరి భాగయ్యగా జన్మించి.. సమాజ సేవా కార్యక్రమాలతో భాగ్యరెడ్డి వర్మగా ప్రసిద్ధి చెందిన ఆయన వర్ధంతి ఈ రోజు..నిజాం పాలిత హైదరాబాద్ రాజ్యంలో అనగారిన వర్గాల గొంతుక భాగ్యరెడ్డి వర్మ.. 1888 సం. మే 22 నాడు మాదిరి వెంకయ్య, రంగమాంబ దంపతులకు జన్మించారాయన.. తొలిపేరు భాగయ్య.. అయితే వారి కుల గురువు భాగ్యరెడ్డి అనే పేరు పెట్టారు.. (రెడ్డి అంటే పాలకుడు అనే అర్థం కూడా ఉంది) చిన్నప్పటి నుండి సామాజిక స్పృహను అలవరచుకున్న భాగ్యరెడ్డిపై ఆర్యసమాజం, బ్రహ్మసమాజం, బౌద్ధం ప్రభావం కూడా ఉంది. అంటరానితనం, దేవదాసీ వ్యవస్థ, మద్యపానం తదితర రుగ్మతలపై పోరాటాలు చేయడమే కాదు, స్వయంగా దళితులకు విద్య, ఉపాధి, సామాజిక హోదాల కోసం తన వంతు కృషి చేశారు. ఆయన సామాజిక సేవా కార్యక్రమాను చూసి ఆర్యసమాజం వర్మ అనే బిరుదును ఇచ్చింది.. అలా బాగ్యరెడ్డి వర్మ పేరు వచ్చింది.అంబేద్కర్ కన్నా ముందే దేశ వ్యాప్తంగా దళితులకు అనాదిగా జరుగుతున్న అన్యాయాలపై గొంతెత్తిన మహానాయకుడు భాగ్యరెడ్డి వర్మ.. తదనంతర కాలంలో బాబా సాహెబ్ తో కలసి ఉద్యమాల్లో పాల్గొన్నారు ' మేము పంచములం కాదు.. ఈ దేశ మూల వాసులం.. ఆది హిందువులం..' అని సగర్వంగా చాటారు.. అనగారిన కులాలను ఆది హిందువులు అని పిలవాలని పిలుపునిచ్చారు. భాగ్యరెడ్డి వర్మ సూచన మేరకు హైదరాబాద్, మద్రాసు ప్రభుత్వాలు వారిని ఆది హిందువులుగా గుర్తించాయి. ప్రారంభంలో జగన్ మిత్ర మండలి, ఆ తర్వాత కాలంలోఆది హిందూ మహా సభ పేరిట తన సేవా కార్యక్రమాలు నిర్వహించారు.. 1910లో చాదర్ఘాట్ దగ్గర ఆది హిందూ పాఠశాల ప్రారంభించారు. మహాత్మా గాంధీ ఈ పాఠశాలను సందర్శించారు. కాలక్రమంలో ఆది హిందూ పాఠశాలలు 26కు విస్తరించాయి.భాగ్యరెడ్డి వర్మ సేవలు హైదరాబాద్ (తెలంగాణ) సంస్థానానికే పరిమితం కాలేదు.. 1917లో విజయవాడలో అంటరాని కులాల సదస్సును నిర్వహించారు. ఆంధ్ర జిల్లాల్లో కూడా పర్యటించి అనగారిన వర్గాల్లో చైతన్యం తీసుకు వచ్చారు. లక్నో, అలహాబాద్, కలకత్తా తదితర ప్రాంతాల్లో జరిగిన దళిత చైతన్య మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. భాగ్యరెడ్డి వర్మ 1939 ఫిబ్రవరి 18న క్షయ వ్యాధితో కన్నుమూశారు. 51 ఏళ్లకే ఆయన అకాల మరణంతో ఆది హిందూ ఉద్యమం, అనగారిన వర్గాల అభివృద్ధి, అభ్యున్నతికి విఘాతం కలిగించింది. భాగ్యరెడ్డి వర్మ గారి వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని సేవలను గుర్తు చేసుకుందాం..

# ఆగని ఏబీవీ రగడ...

విజయవాడ, ఫిబ్రవరి 17, ఆంధ?రప్రదేశ్ ఇంటెలిజెన్స్ డీజీ ఏబీ వెంకటేశ్వరరావు వ్యవహారంలో ఏపీ ప్రభుత్వ దూకుడుకు కేంద్రం బ్రేకులు వేసింది. ఏబీ వెంకటేశ్వరరావును ఉద్యోగం నుంచి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఫిర్యాదుపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఏబీ వెంకటేశ్వరరావుకు 2024 మే 31 వరకూ రెండు ఇంక్రిమెంట్లు నిలిపేయాలని సూచించింది. ఈ మేరకు ఏపీ సీఎస్‌కు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నుంచి లేఖ అందింది.ఆంధ్రప్రదేశ్ నిఘా విభాగం మాజీ అధిపతి, సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావును డిస్మిస్ చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం పంపించిన ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపలేదు. ఏబీ వెంకటేశ్వరరావును ఉద్యోగం నుంచి తొలగించడానికి, తప్పనిసరిగా పదవీ విరమణ చేయించడానికి వీల్లేదని స్పష్టం కేంద్రం చేసింది. ఆయనపై చర్యలుగా 2024 మే 31వ తేదీ వరకూ రెండు ఇంక్రిమెంట్లు మాత్రం నిలిపేయాలని సూచించింది. ఈ మేరకు చర్య తీసుకుని ఆ విషయాన్ని తమకు తెలియ జేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. . ఈ మేరకు కేంద్ర హోంశాఖ అండర్ సెక్రటరీ సంజీవ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖను పంపారు.కేంద్ర హోం శాఖ నుంచి ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డికి జనవరి 10న లేఖ రాశారు. తాజాగా ఈ లేఖ వెలుగుచూసింది. భద్రత, నిఘా పరికరాల కొనుగోలు వ్యవహారంలో అవకతవకలకు పాల్పడ్డారంటూ ఏబీ వెంకటేశ్వరరావుపై రాష్ట్ర ప్రభుత్వం అభియోగాలు మోపింది. ఆయనను ఉద్యోగం నుంచి డిస్మిస్ చేయాలంటూ 2021 డిసెంబరు 16న కేంద్రానికి ప్రతిపాదనలు పంపించింది. గత రెండేళ్లుగా ఏబీ వెంకటేశ్వరరావు సస్పెన్షన్‌లో ఉన్నారు. గతంలో ఆయనపై విధించిన సస్పెన్షన్ ఎత్తేసినా మళ్లీ ఆయనపై ప్రభుత్వం వేటు వేసింది.ఏబీ వెంకటేశ్వరరావును శాశ్వతంగా విధుల నుంచి తొలగించాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేసింది. ఈ నేపథ్యంలో ఆయనకు ఏ మేరకు పెనాల్టీ విధించాలో సూచించాలో కూడా కేంద్ర హోంశాఖ సూచించింది. మరోవైపు ఏబీని విధుల నుంచి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం యూపీఎస్సీని గతేడాది ఫిబ్రవరిలో కోరింది. దీంతో రెండు ఇంక్రిమెంట్లు మాత్రమే నిలిపేయాలని యూపీఎస్సీ సిఫార్సు చేసింది. ఇదే విషయాన్ని తెలియజేస్తూ డిస్మిస్ చేయడానికి యూపీఎస్సీ సిఫార్సు చేయలేదని పేర్కొంటూ కేంద్ర హోంశాఖ ఏపీ సీఎస్‌కు లేఖ రాసింది. అటు ఏబీ వెంకటేశ్వరరావు ఈ నిర్ణయాన్ని క్యాట్‌లో సవాలు చేస్తానని ప్రకటించారు.

# కలకలం రేపుతున్న మంగళికృష్ణ పోస్టులు

కడప, ఫిబ్రవరి 17, ముఖ్యమంత్రి సన్నిహితుడు, పులివెందులకు చెందిన మంగలి కృష్ణ, ముఖ్యమంత్రి కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం కలకలం రేపింది. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి చిన్ననాటి సన్నిహితుల్లో ఒకరైన దంతులూరు కృష్ణ అలియాస్ మంగలి కృష్ణ సిఎం కార్యాలయ అధికారుల్ని లక్ష్యంగా చేసుకుని ఫేస్ బుక్ పోస్టులు పెట్టడం వెనుక కారణమేమిటనే చర్చ జరుగుతోంది.మంగలి కృష్ణ అలియాస్ దంతులూరు కృష్ణ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఒకప్పటి సన్నిహితుల్లో ఒకరు. ఇప్పటికీ వారి మధ్య సాన్నిహిత్యం ఉన్నా, అధికారంలోకి వచ్చిన తర్వాత సిఎం కార్యాలయం మంగలి కృష్ణను కాస్త దూరం పెట్టింది. అధికారంలోకి వచ్చిన తర్వాత మంగలి కృష్ణను ఆంధ్రాలో అడుగు పెట్టొద్దనే స్పష్టమైన ఆంక్షలు విధించారని పార్టీ వర్గాలు చెబుతాయి. పలు కేసుల్లో అభియోగాలు ఎదుర్కొంటున్న మంగలి కృష్ణ పులివెందుల కేంద్రంగా సెటిలిమెంట్లు, దందాలు చేస్తుంటారని ప్రచారం ఉంది.ఏపీలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వంపై ఫ్యాక్షన్ ముద్ర పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ క్రమంలోనే మంగలి కృష్ణ వంటి వారిని సిఎం కాస్త దూరం పెట్టారని చెబుతారు. ప్రభుత్వ కాంట్రాక్టులు, బిల్లుల చెల్లింపు వంటి విషయాల్లో ముఖ్యమంత్రి సమీప బంధువుల సిఫార్సుతో పనులు చేయించుకుంటారని చెబుతుంటారు. ఈ క్రమంలోనే ఏం జరిగిందో కానీ సిఎం కార్యాలయంలో పనిచేసే అధికారుల్ని లక్ష్యంగా చేసుకుని పోస్టులు పెట్టాడు. వాటిని గుర్తించిన నిఘా వర్గాలు ఇంటెలిజెన్స్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లడంతో మంగలి కృష్ణతో మాట్లాడినట్లు తెలుస్తోంది.సోషల్ మీడియా పోస్టుల్ని డిలీట్ చేసిన మంగలికృష్ణ అదే సమయంలో తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని మరో పోస్టు పెట్టారు. ముఖ్యమంత్రి కార్యాలయ అధికారుల వద్ద తన మాట చెల్లుబాటు కావడం లేదనే అక్రోశంతో పోస్టులు పెట్టాడా, మరేదైనా కారణాలు ఉన్నాయా అనేది వెల్లడి కావాల్సి ఉంది."వైఎస్ కుటుంబాన్ని దగ్గర్నుంచి చూశానని, వారి గురించి ఎవరైనా మాట్లాడితే ఎట్లుంటది అన్నీ చూశానని, తాను పెట్టిన మెసేజీ దురుసుగా ఉండొచ్చని, కానీ సిఎంఓ గురించి తాను తక్కువ మాట్లాడానని పేర్కొన్నాడు."“ప్రతిపక్షంలో ఉంటే ఏదైనా తప్పులు జరిగితే దానిని తేల్చాల్సిన బాధ్యత తనలాంటి వాళ్లదని, అధికారంలో ఉన్నపుడు సిస్టంలో ఉన్న వాళ్లు చూడాలని, కొన్నింటికి తాను సమాధానం చెప్పలేనని, 20ఏళ్లుగా అన్ని పార్టీల సిఎంఓలను తాను చూశానని రాసుకొచ్చాడు. సీతారామ్ సర్ కోసం తాను పెట్టిన మెసేజీలను డిలీట్ చేశానని పేర్కొన్నాడు." " ఇంటెలిజెన్స్ డీజీ పిఎస్సార్ ఆంజనేయులును ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారనే ప్రచారం ఉంది. తాను పెట్టిన పోస్టులన్నింటికి కట్టుబడి ఉన్నానని, సిఎంఓలో ఉన్న ధనుంజయ్ రెడ్డికి , గత 30ఏళ్లుగా ముఖ్యమంత్రుల వద్ద ఉన్న వారికి పోల్చి చూస్తే తాను పెట్టిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని పేర్కొన్నారు.మరోవైపు మంగలి కృష్ణ సోషల్ మీడియాలో ముఖ్యమంత్రి కార్యాలయానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టడంపై జగన్మోహన్ రెడ్డి ఎలా స్పందిస్తారనే ఆసక్తికరంగా మారింది. ఈ వ్యవహారాన్ని చూసి చూడనట్టు వదిలేస్తారా, మంగలి కృష్ణను బుజ్జగించడమో, మందలించడమో చేస్తారా అనేది కడప వైసీపీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. పులివెందులలో వైఎస్ కుటుంబానికి నమ్మకంగా ఉన్న వారిలో ఒకరైన మంగలి కృష్ణ ఏమి ఆశించి ఇలా చేస్తున్నారనేది మాత్రం చర్చగా మారింది.

# డైరక్ట్ ఫైట్ కు కోటం రెడ్డి

నెల్లూరు, ఫిబ్రవరి 17, వైసీపీ రెబల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమయ్యారు. నిన్న మొన్నటి వరకు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో వరుసగా ప్రెస్ మీట్లు పెట్టి ప్రభుత్వానికి కౌంటర్లు ఇచ్చిన ఆయన, ఇప్పుడు నిరసన ప్రదర్శనలతో ప్రజల ముందుకొచ్చారు. ముందుగా ముస్లింల నిరసన గొంతుక పేరుతో కార్యక్రమం చేపట్టారు. నెల్లూరు రూరల్ పరిధిలో ముస్లింల కోసం చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలన్నీ నిధుల కొరతతో ఆగిపోయాయని, వాటికి తక్షణం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారాయన.నిధుల కోసం ప్రభుత్వాన్ని ఎన్నిసార్లు అర్థించినా, అభ్యర్థించినా ప్రయోజనం లేదని చెప్పారు ఎమ్మెల్యే కోటంరెడ్డి. అందుకే ఇప్పుడు ప్రశ్నిస్తున్నానని చెప్పారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఏళ్లతరబడి కొన్ని పనులు ఆగిపోయి ఉన్నాయని, వైసీపీ హయాంలో అయినా అవి పూర్తవుతాయనుకుంటే ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండా ఇబ్బంది పెడుతోందన్నారు. మైనారిటీల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదని ఆరోపించారు కోటంరెడ్డి.నెల్లూరులో ప్రతి ఏడాదీ రొట్టెల పండగ నిర్వహించుకునే స్వర్ణాల చెరువు పక్కన ఉన్న బారాషహీద్ దర్గా అభివృద్ధికి రూ.13 కోట్లకు గతంలో సీఎం జగన్ ఆమోదం తెలిపారని, కానీ ఆర్థికశాఖ నిధులు విడుదల చేయలేదని విమర్శించారు. ముస్లిం గురుకుల పాఠశాల భవన నిర్మాణం తెలుగుదేశం పార్టీ హయాంలోనే మొదలైందని, దాన్ని వైసీపీ హయాంలో కూడా తాను పూర్తి చేయలేకపోయానన్నారు. ఎప్పుడు నిధులు అడిగినా లేవనే సమాధానం వస్తోందని ప్రభుత్వంపై మండిపడ్డారు కోటంరెడ్డి.మంజల్ నిర్మాణం కూడా అర్థాంతరంగా ఆగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు ఎమ్మెల్యే కోటంరెడ్డి.. ఈ సమస్యల మీద గట్టిగా మాట్లాడుతున్నానని తనను పార్టీలో అవమానించారని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ చేసి ఆవేదనకు గురిచేశారన్నారు. నిధుల కోసం అర్థించినా, అభ్యర్థించినా ప్రయోజనం లేదని, అందుకే ఇప్పుడు ప్రభుత్వాన్ని ప్రశ్నించానని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని హెచ్చరించారు కోటంరెడ్డి.ప్రభుత్వం చేసిన పనిని మరో ప్రభుత్వం అడ్డుకోవడం సరికాదని హితవుపలికారు కోటంరెడ్డి. టిడ్కో ఇళ్ల విషయంలో కూడా ఇదే జరిగిందన్నారు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి. టిడ్కో ఇళ్లను గత ప్రభుత్వం మొదలు పెట్టినా, ఈ ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండా వాటిని ఆలస్యం చేసిందని, పూర్తయిన ఇళ్లను కూడా మౌలిక సదుపాయాలు సాకుగా చూపించి లబ్ధిదారులకు ఇవ్వడం లేదని చెప్పారు.నెల్లూరు రూరల్ పరిధిలోని సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం

ముందుకొచ్చిందా సరే, లేకపోతే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామంటూ ఇదివరకే హెచ్చరించారు ఎమ్మెల్యే కోటంరెడ్డి. అన్నమాట ప్రకారం ఆయన ఇప్పుడు పోరాటానికి సిద్ధమయ్యారు. ముస్లింల నిరసన గొంతుక వినిపించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలో ముస్లింల జనాభా ఎక్కువ. రూరల్ లో ముస్లిం ఓటర్లు జయాపజయాలను ప్రభావితం చేస్తుంటారు. ఇప్పటి వరకూ ముస్లింలు వైసీపీకే మద్దతుగా ఉంటూ వచ్చారు. గతంలో నెల్లూరు రూరల్ లో టీడీపీ మైనార్టీ అభ్యర్థిని బరిలో దింపినా ముస్లింల ఓట్లు వైసీపీకే పడ్డాయి. ప్రస్తుతం ఎమ్మెల్యే కోటంరెడ్డి వైసీపీని వీడి బయటకు వచ్చారు. ఆయన ఏ పార్టీలో ఉన్నా ముస్లింలు ఆయనకే మద్దతిస్తారని అనుచరులు చెబుతున్నారు. అయితే అధికార వైసీపీ మాత్రం ముస్లిం నాయకులను తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తోంది. ఈ క్రంలో ముస్లింల సమస్యలకోసం గళమెత్తిన కోటంరెడ్డి వారికి మరింత దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారు.

# చంద్రబాబు పర్యటనలకు పోలీసులు అడుగడుగునా అడ్డంకులు

కాకినాడ ఫిబ్రవరి 17 : తూర్పుగోదావరి జిల్లాలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పర్యటనలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. చంద్రబాబు అనపర్తి సభ కు పోలీసులు అనుమతి నిరాకరించారు. ఈ మేరకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈరోజు చంద్రబాబు అనపర్తి పర్యటనకు కలెక్టర్ ఎస్పీ నిన్ననే అనుమతి ఇచ్చారు. అయితే సభకు అనుమతి రద్దు చేస్తున్నట్లు ఈరోజు పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులపై టీడీపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అయితే... చంద్రబాబు పర్యటనలకు పోలీసులు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తూనే ఉన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో టీడీపీ అధినేత పర్యటనను అడ్డుకునేందుకు ఎక్కడా లేని ఆంక్షలు విధిస్తున్నారు. గత రెండు రోజులుగా జిల్లాలో చంద్రబాబు పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో పెద్దఎత్తున ప్రజలు చంద్రబాబు పర్యటనలో పాల్గొంటున్నారు. చంద్రబాబుకు ఎక్కడిక్కడ హారతులు పడుతున్నారు. తమ సమస్యలను టీడీపీ అధినేతకు చెప్పుకొంటున్నారు. రెండు రోజులుగా విజయవంతంగా పర్యటిస్తున్న చంద్రబాబు ఈరోజు సామర్లకోట నుంచి బయలుదేరి అనపర్తిలో భారీ బహిరంగ సభ నిర్వహించాల్సి ఉంది. ఈ తరుణంలో రాజమహేంద్రవరం పోలీసులు తాజాగా నోటీసులు జారీ చేశారు.



# కోనసీమలో సామూహిక అత్యాచారం

అమలాపురం, ఫిబ్రవరి 17, (న్యూస్ పల్స్)ఆడ పిల్లలపై అఘాయిత్యాలు కొనసాగుతూనే ఉన్నాయి.. చిన్నా, పెద్దా తేడాలేకుండా తమ పశువాంఛ తీర్చుకుంటున్నారు కామాంధులు.. ఇక, కొన్ని ఘటనల్లో శీలానికి కుల పెద్దలు, గ్రామ పెద్దలు వెలకట్టిన సందర్భాలు లేకపోలేదు.. తాజాగా, అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గంలో జరిగిన దారుణమైన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది.. బాలికపై సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు.. ఐదుగురు యువకులు.. ఆ తర్వాత ఈ విషయం బయటకు పొక్కకుండా ప్రయత్నాలు చేశారు.. బాధితురాలి కుటుంబానికి డబ్బులు ఇచ్చి తప్పి కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు.. కానీ, మనసు అంగీకరించక బాధితురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. ఈ ఘటన బయటపడింది.పూర్తి వివరాల్లోకి వెళ్తే.. కాట్రేనికోన మండలం చిర్రయానాం గ్రామంలో మైనరు బాలికపై ఈ నెల 6వ తేదీన సామూహిక అత్యాచారం జరిగింది.. మాయమాటలు చెప్పి బాలికను తీసుకెళ్లిన యువకులు.. ఆ చిన్నారిపై సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు.. ఒకరితర్వాత ఒకరు ఇలా ఐదుగురు యువకులు కలిసి ఆ బాలికపై పడి తమ పశువాంఛ తీర్చుకున్నట్టు తెలుస్తోంది.. ఇక, ఈ విషయం బైటకు రాకుండా కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు అధికార పార్టీ నాయకులు.. బాధితురాలు కుటుంబానికి డబ్బులు ఇచ్చి తప్పు కప్పిపుచ్చే ప్రయత్ననీ చేశారు.. కానీ, బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.. ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.. మరోవైపు.. అమలాపురం డీఎస్పీ మాదవరెడ్డి, ముమ్మిడివరం సీఐ జానకీరామ్ గ్రామానికి వెళ్లి దర్యాప్తు చేపట్టారు. అయితే, బాలిక శీలానికి వెలకట్టి ఈ ఘటన వెలుగు చూడకుండా ప్రయత్నం చేయడంపై స్థానికులు మండిపడుతున్నారు.

# కన్నా వ్యాఖ్యలపై స్పందించను

విజయవాడ, ఫిబ్రవరి 17, (న్యూస్ పల్స్)బీజేపీకి ఆ పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ రాజీనామా చేయడం సంచలనంగా మారింది.. రాజీనామా చేసే సమయంలో.. అధ్యక్షుడు సోము వీర్రాజు, ఎంపీ జీవీఎల్‌ను టార్గెట్ చేసిన కన్నా.. బీజేపీని పార్టీలాగా కాకుండా.. ఏదో వ్యక్తిగత సంస్థలాగా నడుపుతున్నారు.. పార్టీలో చర్చించకుండానే నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించిన విషయం విదితమే.. అయితే, కన్నా లక్ష్మీనారాయణ వ్యాఖ్యలపై స్పందించడానికి నిరాకరించారు ఏపీ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు.. బాపట్ల జిల్లా పర్యటనలో ఉన్న ఆయన.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కన్నా లక్ష్మీనారాయణ నాపై చాలా కాలం నుండి ఆరోపణలు చేస్తున్నారు.. కన్నా వ్యాఖ్యలపై అప్పుడు స్పందించలేదు.. ఇప్పుడు స్పందించాల్సిన అవసరం లేదన్నారు. అయితే, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో నడవాలంటే బీజేపీ, జనసేన ప్రభుత్వ స్థాపన జరగాలని అన్నారు.. ఇక, ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలో భారతదేశం ఎంతో అభివృద్ధి చెందిందిన్న సోము వీర్రాజు.. ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాలకు 60 శాతం నిధులను కేంద్రమే అందిస్తుందని మరోసారి చెప్పుకొచ్చారు..మరోవైపు.. విజయవాడ ఇంద్ర కీలాద్రిపై జరిగిన వారాహి పూజా సమయంలో బీజేపీతో కలిసి ఉన్నామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన ప్రకటనను గుర్తుచేశారు సోము వీర్రాజు. కాగా, జనసేనతో తప్ప.. రాష్ట్రంలో మరో పార్టీతో పొత్తు ఉండబోదని.. కుటుంబ పార్టీలకు, కుటుంబ పాలనకు తాము వ్యతిరేకమని గతంలోనూ స్పష్టం చేశారు సోమువీర్రాజు.. అయితే, ఇప్పుడు కన్నా లక్ష్మీనారాయణ ఎపిసోడ్ హాట్ టాపిక్‌గా మారిపోయింది.. గురువారం రోజు.. ఆయన బీజేపీకి రాజీనామా చేస్తూ.. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు లెటర్ పంపగా.. ఆయన బాటలో మరికొందరు నేతలు ఇప్పుడు రాజీనామాలు చేస్తున్నారు. కాగా, బీజేపీకి రాజీనామా చేసిన కన్నా లక్ష్మీనారాయణ.. తన అనుచరులతో కలిసి త్వరలోనే టీడీపీలో చేరతారనే ప్రచారం సాగుతోంది.. దీనికి సంబంధించి ముహూర్తం కూడా ఫిక్స్ అయ్యిందంటున్నారు.

# పదవుల్లో ఉన్నామని అహంకారం వద్దు

గుంటూరు, ఫిబ్రవరి 17, (న్యూస్ పల్స్)పదవుల్లో ఉన్నామని అహంకారంతో ఉంటే.. ఎన్నికల్లో ప్రజలు సాగనంపడం ఖాయం అని హెచ్చరించారు జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్.. జనసేన కార్యాలయంలో సత్తెనపల్లి గంగమ్మకు ఆర్థిక సాయం అందించిన నాదెండ్ల మనోహర్.. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబుపై ధ్వజమెత్తారు.. రూ. 5 లక్షల నష్టపరిహారం చెక్ ఇవ్వకుండా మంత్రి అంబటి అడ్డుకున్నారని గతంలో ఆరోపణలు వచ్చాయి.. ఇప్పటికీ నష్టపరిహారం ఇవ్వలేదంటూ విమర్శించారు.. దీంతో, బాధితురాలు గంగమ్మకు జనసేన తరపున ఆర్థిక సాయం చేస్తున్నామని వెల్లడించారు.. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా దారుణాలు, దాడులు పెరిగాయని విమర్శించారు. జనసేన ఏ కార్యక్రమం చేపట్టినా ఆటంకాలు కలిగిస్తున్నారు. వినాయక చవితి ఉత్సవాల నుంచి పార్టీ సభల వరకూ ఆంక్షలే అని మండిపడ్డారు.గంగమ్మ కుమారుడు సెప్టిక్ ట్యాంకులో పడి ప్రాణాలు కోల్పోయాడు.. మంత్రి అంబటి రాంబాబు బయటకు రాకుండా పంచాయతి చేశారని.. సీఎం సహాయ నిధి నుంచి సాయం అందిస్తామని వివాదం కాకుండా జాగ్రత్త పడ్డారని విమర్శించారు నాదెండ్ల మనోహర్.. రూ. 5 లక్షలు మంజూరైతే.. అందులో సగం తమకు ఇవ్వాలని అంబటి హెచ్చరించాడని ఆరోపించారు.. దీంతో మమ్మల్ని కలిసి అంబటి బెదిరింపులను ధైర్యంగా చెప్పారు. ఆ సభలో మా అధినేత వైసీపీ దాష్టికాలను ప్రశ్నించారు. అంబటి రాంబాబు అవినీతిని నిలదీశారు.. నా తప్పును నిరూపించండని అంబటి రాంబాబు సవాల్ ను జనసేన స్వీకరించిందన్నారు.. బాధితురాలు గంగమ్మకు అండగా నిలబడి అంబటి అవినీతిని బయట పెట్టామని ప్రకటించారు. ఎన్ని బెదిరింపులు వచ్చినా గంగమ్మ ధైర్యంగా నిలబడ్డారు.. ఒక ఎమ్మెల్యే అయి ఉండి ఒక పేద మహిళను ఇబ్బందులు పెట్టారని ఫైర్ అయ్యారు. చివరికి రూ. 5 లక్షల చెక్ ఆమెకు ఇవ్వకుండా వెనక్కి పంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సత్తెనపల్లి ప్రజల ఓట్లతో గెలిచి ఆ ప్రజల పైనే ప్రతీకారమా..? మీ కక్షలతో పేదల జీవితాలతో ఆడుకుంటారా..? చెక్ కనిపించడం లేదని అధికారులు కూడా డ్రామాలు ఆడతారా? చేతికి వచ్చిన కొడుకు చనిపోతే ఆ తల్లి మీద కనీస జాలి లేదా..? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. పదవుల్లో ఉన్నామని అహంకారంతో ఉంటే.. సాగనంపడం ఖాయమని హెచ్చరించిన ఆయన.. ఎన్ని ప్రయత్నాలు చేసినా అంబటి రాంబాబు అధికారం అండతో డబ్బులు రాకుండా చేశారని.. అక్క, చెల్లెళ్లు అని చెప్పే సీఎం జగన్‌కి చిత్తశుద్ధి ఉంటే అంబటి రాంబాబుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ తల్లికి జరిగిన అన్యాయంపై జనసేన మానవత్వంతో స్పందించింది.

# బీబీసీ న్యూస్ ఛానెల్ కార్యలయంపై ఐటి దాడుల వేధింపులను ఆపాలి.



కర్నూలు ఫిబ్రవరి 17, 2002లో గుజరాత్ మత మారణహోమంలో నాటి గుజరాత్ ముఖ్యమంత్రి నేటి ప్రధాని నరేంద్ర మోడీ పాత్రను బయట పెట్టినందుకు బిబిసి వార్తా ఛానల్ పై వేధింపులకు దిగిన కేంద్ర ప్రభుత్వ చర్యను ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ,ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘాల తీవ్రంగా ఖండిస్తోంది. ఈ దాడులకు నిరసనగా శుక్రవారం కర్నూలు కలెక్టర్ కార్యాలయం ముందు ఏపీడబ్ల్యూజేఎఫ్ నగర అధ్యక్షులు శివకుమార్ అధ్యక్షత న ధర్నా ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపియుడబ్ల్యూజె జిల్లా అధ్యక్షులు నాగరాజు , ఐజెయూ రాష్ట్ర సమితి నాయకులు కొండప్ప,జేఏసీ చైర్మన్ సత్యన్న,ఏపీడబ్ల్యూజేఎఫ్ నగర ప్రధాన కార్యదర్శి నాగేంద్ర లు మాట్లాడుతూ గుజరాత్ నరమేధంలో నరేంద్ర మోడీ పాత్ర గురించి ఇటీవల బిబిసి ఒక డాక్యుమెంటును ప్రసారం చేసిన నేపథ్యంలో ఢిల్లీలోని బిబిసి కార్యాలయాలపై ఆదాయపు పన్ను అధికారులు సెర్చ్/సర్వే పేరుతో దాడులకు దిగడం పత్రికా స్వేచ్ఛపై పరోక్ష సెన్సార్షిప్ కు పాల్పడడమేనని ఎపిడబ్ల్యుజెఎఫ్,ఎపియుడబ్ల్యుజె భావిస్తున్నది. కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాము.ప్రధాని మోడీ నిజస్వరూపాన్ని బయటపెట్టినందుకు ఇప్పటికే బిబిసి డాక్యుమెంటు

**పత్రిక స్వేచ్ఛను గొంతు నొక్కుతున్న కేంద్ర ప్రభుత్వం.**
**ఏపీడబ్ల్యూజేఎఫ్, ఎపియుడబ్ల్యుజె ఆధ్వర్యంలో ధర్నా.**
**కలెక్టర్ కు వినతి.**

లింకులను సామాజిక మాధ్యమాల్లో పెట్టడాన్ని నిషేధించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు నేరుగా ఆ వార్తా ఛానల్ పైనే దాడులకు దిగింది. దేశంలో తనపై విమర్శలు చేసే మీడియాను అనేక విధాలా వేధింపులకు గురిచేస్తున్న ప్రభుత్వం ఇప్పుడు తనను విమర్శించే విదేశీ మీడియా పైన కూడా దాడులు చేయడం ద్వారా భారత దేశంలోని పరిస్థితులను ప్రపంచానికి చాటి చెబుతున్నదన్నారు. పత్రికా స్వేచ్ఛపై కేంద్ర ప్రభుత్వం జరుపుతున్న ఈ దాడులను ఎడిటర్స్ గిల్డ్ తో పాటు ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా, కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్, రిపోర్టర్స్ విథౌట్ బోర్డర్స్, నేషనల్ ఎలియన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ తదితర సంస్థలు ఖండించాయన్నారు.భావ ప్రకటనా స్వేచ్ఛపై ఉక్కుపాదం మోపుతున్న నరేంద్ర మోడీ చర్యలను ఖండిస్తున్నామన్నారు.పత్రికల స్వేచ్ఛను భంగం కలిగించకుండా రాజ్యాంగ హక్కులను కాపాడాలని పత్రికలకు జర్నలిస్టులకు రక్షణ ఇవ్వాలని కోరుతున్నాము.భారత దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నేటి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు రాజ్యాంగానికి విరుద్ధంగా ఉన్నాయన్నారు.ఇప్పటికైనా బీబీసీ న్యూస్ చానెల్ పై వేధింపులు నిలిపివేయాలని పత్రికల స్వేచ్ఛను హరించకుండా ఉండాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ ,ఎపియుడబ్ల్యుజె కోరుతుంది.తక్షణమే వేధింపులు నిలిపివేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా దేశ వ్యాప్తంగా జర్నలిస్ట్ ల సంఘాల ఆధ్వర్యంలో దేశ వ్యాప్త ఉద్యమమం నిర్వహిస్తామన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు కు డిమాండ్లతో కూడిన వినతి అందించారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ జాతీయ సమితి సభ్యులు నాగరాజు,ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు చంద్రమోహన్, నగర ఉపాధ్యక్షులు విద్య సాగర్,రమేష్ ,సహాయ కార్యదర్శి శ్రీరాములు,నాయకులు మునిస్వామి, శివ శంకర్,ఎపియుడబ్ల్యుజె జిల్లా సహాయ కార్యదర్శి అవినాష్, జిల్లా కార్యవర్గ సభ్యులు చిరంజీవి, శివ, శీను, సంపత్, చంద్ర శేఖర్ ,అనీల్, గంగధర్,తదితరులు పాల్గొన్నారు.

# ఆర్జేడి ప్రతాప్ రెడ్డి ని సస్పెండ్ చెయ్యాలి......

**ఎఐ యస్ ఫ్. ఎఐటియుసి నాయకుల డిమాండ్.**




నంద్యాల :– శుక్రవారం నాడు నంద్యాలలో సాయి బాబా నగర్ జంక్షన్లో ఆర్జెడి ప్రతాపరెడ్డి ని సస్పెండ్ చేయాలని ఎఐ యస్ ఫ్. ఎఐటియుసి నాయకుల . ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు . ఎఐటియుసి . పట్టణ కార్యదర్శి డి. శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమానికి సిపిఐ జిల్లా సహాయ ఎస్ బాబా ఫక్రుద్దీన్ సిపిఐ పట్టణ కార్యదర్శి కే ప్రసాద్ సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి జి సోమన్న ఎఐయస్ ఫ్ . జిల్లా సహాయ కార్యదర్శి పి. ఎర్రిస్వామి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ నిన్నటి దినం కర్నూలు జిల్లా ఆదోనిలో పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గం నుంచి శాసనమండలికి జరుగుతున్న ఎన్నికలలో పోటీ చేస్తున్న వైఎస్ఆర్సిపి అభ్యర్థికి అనుకూలంగా విద్యాశాఖ ఆర్ జే డి ప్రతాప్ రెడ్డి ప్రచారం చేయడాన్ని నిరసిస్తూ సిపిఐ ఎఐయస్ ఫ్ . నాయకులు అడ్డుకుంటే వారిపై పోలీసు వారు దురుసుగా ప్రవర్తించడం అరెస్టు చేయడం హేయమైన చర్య అని అన్నారు. చట్టసభలకు మేధావులను పంపించే పద్ధతిలో ఉండాలి కానీ అధికార పార్టీ వారు నిలబెట్టిన అధికార అభ్యర్థిని గెలిపించాలని శతవిధాల డబ్బులు ఏరా చూపించి మేధావుల ఓట్లు కూడా కొనాలని ప్రయత్నం చాలా దుర్మార్గమని వారు విమర్శించారు . ఇప్పటికైనా అధికార పార్టీ ఈ ఎత్తుగడలు మానుకొని ఓట్లను సజావుగా నడిపించి పెద్దల సభకు మేధావులను పంపేవిధంగా ఉండాలని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఎఐటియుసి , ఎఐయస్ ఫ్ . నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబైన బోడబండ పుణ్యక్షేత్రం

**నేడు తుగ్గలిలోని యాగంటీశ్వర దేవాలయం నందు కలశ ప్రతిష్ట మరియు యాగంటి ఈశ్వరునికి మహా రుద్రాభిషేకాలు.**

తుగ్గలి: మండల పరిధిలోని గల ఉప్పర్ల గ్రామ సమీపంలోని బోడబండలో వెలసిన శ్రీ పకీరప్ప గురు స్వాములు,శ్రీ ఎల్లప్ప గురు స్వాములు మరియు శ్రీ ఆంజనేయులు తాత వారి మహాశివరాత్రి ఉత్సవ వేడుకలు ఫిబ్రవరి నేటి నుండి ప్రారంభమవుతాయని, మహాశివరాత్రి వేడుకలకు సంబంధించి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని ఆలయ ధర్మకర్త అప్పా వేణు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారము ఉదయం శ్రీ అప్పా చంద్రశేఖర్ గారి ఇంటి నుండి స్వామివారి ఆభరణములు శ్రీ పక్కీరప్ప స్వామి దేవస్థానమునకు చేరుతాయని,శనివారము సాయంత్రం శ్రీ బోడబండ పక్కీరప్ప స్వామి,శ్రీ యల్లప్ప స్వామి గారి ఉత్సవమూర్తులు అప్పా సంజీవులు,అప్పా రవి,అప్పా లక్ష్మీ నారాయణ గార్ల ఆధ్వర్యమున అప్పా వెంకటరాముని ఇంటి నుండి ఊరేగింపు జరిగిన పిమ్మట బోడబండ దేవస్థానమునకు చేరుతాయని తెలియజేశారు.ఆదివారము ఉదయం 8–00 గం.లకు శ్రీ పక్కీరప్ప స్వామి,శ్రీ యల్లప్ప స్వామి,శ్రీ ఆంజనేయులు తాత ఉత్సవమూర్తులు అప్పా నారాయణ స్వామి ఆధ్వర్యమున గంగా స్నానం నిర్వహిస్తారని, అనంతరం 11–00 గం.ల నుండి పెరవలి గ్రామము గవ్వల గురునాథము,మొలగవెల్లి గ్రామ వాస్తవ్యులు శ్రీ రంగన్న తాత,శ్రీ పక్కీరప్ప తాత భక్తాదులు మరియు హైదరాబాద్ శ్రీరాములు గార్లచే అన్నదాన కార్యక్రమము జరుగునని,ఆదివారం సాయంత్రం 5–00 గం.లకు శ్రీ పక్కీరప్ప స్వామి, శ్రీ యల్లప్ప స్వామి శ్రీ ఆంజనేయులు తాత గార్ల రథోత్సవము శ్రీ అప్పా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరుగుతుందని వారు తెలియజేశారు.రాత్రి 8–00 గం.లకు శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి నాటక ప్రదర్శన జరుగుతుందని ఆలయ ధర్మకర్త అప్పా వేణు తెలియజేశారు.21వ తేదీ మంగళవారము శ్రీ స్వామి వారి హుండి అప్పా వేణు (ధర్మకర్త), అప్పా నారాయణ స్వామి, అప్పా సత్యన్న, అప్పా వెంకట రాముడు,అప్పా వెంకటేశ్,అప్పా సురేష్ గార్ల ఆధ్వర్యంలో లెక్కించబడునని ఆలయ ధర్మకర్త అప్పా వేణు తెలియజేశారు.

# మహానంది లో మూడు రోజుల పాటు మద్యం షాపు మూసివేత.

నంద్యాల :-. మహానంది మండలంలో నీ మహానందిలో క్షేత్రంలో ఉన్నటువంటి మద్యం షాపును మూడు రోజులపాటు మూసివేస్తున్నట్లు నంద్యాల ఎక్సైజ్ సీఐ కృష్ణ కుమార్ పేర్కొన్నారు. 17 రాత్రి నుండి 21వ తేదీ ఉదయం వరకు మహానంది క్షేత్రంలో ప్రభుత్వ ఆధీనంలో ఉన్నటువంటి మద్యం దుకాణం మూసివేస్తున్నట్లు తెలిపారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని మిగతా చోట్ల ఉన్నటువంటి ప్రభుత్వ ఆధీనంలో ఉన్న మద్యం దుకాణాలు యధావిధిగా కొనసాగన్నున్నట్లు తెలిపారు .



# పాగాలంకరణ, స్వామిఅమ్మవార్ల కళ్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు

నంద్యాల :–భూకైలాసంగా ప్రసిద్ధమైన శ్రీశైల పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్ పేర్కొన్నారు. ఈ నెల 18వ తేదీ మహాశివరాత్రి పర్వదిన సందర్భాన్ని పురస్కరించుకుని స్వామి వారికి నందివాహనసేవ, పాగాలంకరణ, స్వామిఅమ్మవార్ల బ్రహ్మోత్సవ కల్యాణాన్ని అంగరంగవైభవంగా నిర్వహించేందుకు సకల ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు. భక్తులకు వేగంగా మల్లన్న దర్శనమయ్యేలా నాలుగు రకాల క్యూలైన్ల ద్వారా భక్తులకు అనుమతించి వేగంగా దర్శనం కల్పిస్తున్నామన్నారు. 14 కంపార్టుమెంట్లలో ఉచిత దర్శన భక్తులు వేచివుండే అవకాశం కల్పించాలన్నారు. పాతాళగంగ మార్గంలోని శివదీక్షా శిబిరాలలో భక్తులు ఇరుముడి సమర్పణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. శివదీక్షా శిబిరాలు, గంగాసదన్ వెనుకభాగం, టోల్ గేట్ సమీపంలోని బసవ వనం, మల్లమ్మకన్నీరు తదితర ముఖ్య కూడళి ప్రాంతాలలో భక్తులు సేద తీరేందుకు చలువ పందిర్లు ఏర్పాటు చేశామన్నారు. సాక్షిగణపతి, పార్కింగ్ ప్రదేశాలు, కల్యాణకట్ట, చండీశ్వరసదన్, అన్నదాన భవనం తదితర ఆరుబయలు ప్రదేశాలలో కూడా చలువపందిర్లు వేశామన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా మొత్తం 30 లక్షల లడ్డు ప్రసాదాలను కూడా సిద్ధం చేసి 15 కౌంటర్ల ద్వారా భక్తులకు అందుబాటులో ఉంచామన్నారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా రోజుకు 30 లక్షల గ్యాలన్లను మంచినీటిని సరఫరా చేయడం జరుగుతోందన్నారు. క్షేత్రపరిధిలో 400 పబ్లిక్ కుళాయిలు ఏర్పాటు చేశామన్నారు.వెంకటాపురం,నాగలూటి, పెద్దచెరువు, భీమునికొలను మెట్లమార్గం, కైలాసద్వారం, హాటకేశ్వరం, సాక్షిగణపతి, మొదలైన ప్రదేశాలలో కాలినడకన వచ్చే భక్తులకు మంచినీటి వసతి కల్పించామన్నారు. యజ్ఞవాటిక, వాసవీవిహార్, జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, రింగ్ రోడ్డు, ఏపిఎస్ ఆర్టీసి, తెలంగాణా ఆర్టీసీ, కర్ణాట ఆర్టిసి బస్సులకు, ప్రైవేటు వాహనాలకు క్షేత్రపరిధిలోని 29 ఎకరాల విస్తీర్ణంలో పార్కింగ్ సౌకర్యం కల్పించామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద 30 పడకల తాత్కాలిక వైద్యశాలతో పాటు అవసరమై అన్ని ప్రాంతాలలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. పాతాళగంగలో నీటిమట్టం తగ్గుతోన్న కారణంగా భక్తులకు జల్లు స్నానాలకు ఏర్పాటు చేశామన్నారు. అలాగే మహిళలకు దుస్తులు మార్చుకునే గదులు, తాత్కాలిక టాయిలెట్లకు మరమ్మతులు చేశామన్నారు. గంగాభవాని స్నానఘట్టాలవద్ద స్నానాలు చేసేందుకు కూడా ఏర్పాట్లు చేశామన్నారు. క్షేత్రపరిధిలో 750 శాశ్వత టాయిలెట్లను భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఆలయ పుష్కరిణి వద్ద గల భ్రామరీ కళావేదిక, శివదీక్షా శిబిరాలలోని నటరాజ కళావేదిక, మాడవీధిలోని నిత్య కళారాధన వేదికలో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవాలలో మొత్తం 1200 పైగా సమాచార సూచిక బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవ సమయాలలో శివదీక్షా భక్తులకు రెండు ప్రత్యేక హాల్స్ నందు మధ్యాహ్నం, రాత్రివేళలో అన్నప్రసాద వితరణ జరుగుతోందన్నారు.

# 'సార్' హిట్ అయితే మరిన్ని బహుభాషా సినిమాలు ఖాయం



తెలుగు సినిమా కు ఉన్న క్రేజ్ మరియు మార్కెట్ నేపథ్యంలో ఇతర భాషల హీరోలు తెలుగు సినిమా ల్లో నటించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అందులో భాగంగానే తమిళ సూపర్ స్టార్ విజయ్ వారసుడు సినిమా వచ్చింది.. అంతే కాకుండా శివ కార్తికేయన్ నటించిన ప్రిన్స్ వచ్చింది. రేపు ధనుష్ నటించిన సార్ కూడా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.ఈ తమిళ హీరోలు తెలుగు మార్కెట్ నుండి భారీ వసూళ్లు సాధించాలని ఆశ పడ్డారు. విజయ్ మరియు శివ కార్తికేయన్ లకు నిరాశ మిగిలింది. ఇప్పుడు అందరి చూపు ధనుష్ వైపు చూస్తున్నారు. సార్ సినిమాకు తెలుగు రాష్ట్రాల్లో మంచి బజ్ క్రియేట్ అయ్యే విధంగా ప్రమోషన్ కార్యక్రమాలు నిర్వహించారు. ధనుష్ రెండు సార్లు హైదరాబాద్ వచ్చి సినిమాను ప్రమోట్ చేయడం జరిగింది.సార్ సినిమా ఎలాగూ తమిళనాట మినిమంగా వసూళ్లు నమోదు చేస్తుంది. హిట్ అయితే భారీగా వసూళ్లు రాబట్టడం ఖాయం. అయితే తెలుగు రాష్ట్రాల్లో మినిమం ఓపెనింగ్స్ కలెక్షన్స్ ను ఈ సినిమా ఫలితం తో సంబంధం లేకుండా రాబట్టాల్సి ఉంది. సినిమాకు చేసిన ప్రమోషన్ మినిమం కలెక్షన్స్ రాబట్టడం లో ఉపయోగపడే అవకాశాలు ఉన్నాయి.ధనుష్ సార్ సినిమా మంచి ఓపెనింగ్స్ రాబట్టి పాజిటివ్ టాక్ దక్కించుకుని లాంగ్ రన్ లో భారీ గా వసూళ్లు రాబడితే ముందు ముందు తెలుగు లో పర భాష హీరోలు పలువురు నటించే అవకాశాలు ఉన్నాయి. సార్ ఫలితం తారు మారు అయితే ముగ్గురు హీరోలు తెలుగు లో ప్రయత్నించి విఫలం అయ్యారు కనుక ఇప్పట్లో ఇతర భాషల హీరోలు తెలుగు లో సినిమా చేసేందుకు కాస్త వెనుకంజ వేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.తెలుగు తో పాటు తమిళంలో సినిమాలను చేయడం ద్వారా ఆ హీరోలకు అక్కడ ఉన్న క్రేజ్ కలిసి వచ్చి స్థానిక భాష లో భారీగా వసూళ్లు నమోదు అవ్వడం జరుగుతుంది. ఇక తెలుగు లో కూడా మంచి వసూళ్లు నమోదు చేసుకుంటే అదనం అన్నట్లుగా భావిస్తున్నారు. కనుక చాలా మంది హీరోలు బహు భాష సినిమాలు చేయాలని ఆశ పడుతున్నారు. ప్రస్తుతానికి వారు అంతా కూడా సార్ వైపు చూస్తున్నట్లుగా తెలుస్తోంది.

# ఫ్లాపులున్నా మిల్కీ బ్యూటీ తగ్గట్లేదుగా!



టాలీవుడ్ లో క్రేజీ హీరోయిన్ గా పేరు తెచ్చుకున్న మిల్కీ బ్యూటీ తమన్నా 'ఎంసీఏ' ఫేమ్ బాలీవుడ్ నటుడు విజయ్ వర్మతో ప్రేమలో వుందని వీరిద్దరూ త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నారంటూ ఇటీవల వరుస కథనాలు వినిపిస్తున్నాయి.ఈ వార్తలకు తగ్గట్టుగానే తమన్నా విజయ్ వర్మ తరచూ కలిసి కనిపిస్తూ వార్తల్లో నిలుస్తున్నారు. ఇదిలా వుంటే బాలీవుడ్ కోలీవుడ్ టాలీవుడ్ లలో నటిస్తూ క్రేజీ తగ్గినా కూడా ఊహించని స్థాయిలో అవకాశాల్ని దక్కించుకుంటూ ఆశ్చర్య పరుస్తోంది తమన్నా.పద్దెనిమిదేళ్ల సినీ ప్రస్థానంలో ఎన్నో సక్సెస్ లు మర్చిపోలేని విజయాల్ని దక్కించుకున్న తమన్నా హిందీ తమిళ తెలుగు భాషల్లో క్రేజీ స్టార్ల సరసన నటించి ఆకట్టుకుంది. గత కొంత కాలంగా వరుస ఫ్లాపులని ఎదుర్కొంటూ కెరీర్ పరంగా సతమతమవుతోంది.ఒక విధంగా చెప్పాలంటే తమన్నా టైమ్ అయిపోయిందనే కామెంట్ లు వినిపిస్తున్నాయి. గత ఏడాది ఐదు సినిమాల్లో నటించినా తమన్నాకు చేదు అనుభవమే ఎదురైంది.అందులో ఒక్కటంటే ఒక్కటి కూడా హిట్ అనిపించుకోలేదు. 'ఎఫ్ 3' కొంతలో కొంత ఫరవాలేదనిపించింది. అయితే వరుస ఫ్లాపుల ప్రభావం తమన్నా పై వుంటుందని ఇక తనకు క్రేజీ ఆఫర్లు కష్టమని అంతా భావించారు.అయితే ఆ కామెంట్ లకు భిన్నంగా క్రేజీ ఆఫర్లని దక్కించుకుంటూ ఆశ్చర్యపరుస్తోంది. ప్రస్తుతం తెలుగు తమిళ మలయాళ హిందీ భాషల్లో నటిస్తున్న తమన్నా తెలుగులో 'భోళా శంకర్'లో మెగాస్టార్ కు జోడీగా నటిస్తోంది.గతంలో 'సైరా నరసింహారెడ్డి'లో తొలి సారి చిరుకు జోడీగా తమన్నా కనిపించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం రెండవ సారి చిరుతో కలిసి నటిస్తోంది.ఇదిలా వుంటే తాజాగా తమన్నాకు బంపర్ ఆఫర్ తగిలింది. ఎదురు చూస్తున్న అవకాశం అడక్కుండానే తన వద్దకు చేరింది. అదే సూపర్ స్టార్ రజనీకాంత్ 'జైలర్'. ఇందులో తమన్నా తొలిసారి రజనీకి జోడీగా కనిపించ బోతోంది.ఇదే తనని సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తోందట.రజనీతో కలిసి నటిస్తానని అస్సలు ఊహించలేదని తన లాంటి హీరోయిన్ లు రజనీతో కలిసి ఒక్క సినిమా అయినా చేయాలని ఆశగా ఎదురు చూస్తుంటారని అలాంటి అవకాశం నన్ను వెతుక్కుంటూ రావడం.. ఈ విషయాన్ని తలుచుకుంటేనే తనకు గర్వంగా వుందని చెబు తోంది తమన్నా. తన లక్కుని గమ నించిన వారంతా ఫ్లాపు లున్నా తమన్నా ఎక్కడా తగ్గడం లేదని కామెంట్ లు చేస్తున్నారు.

# పవన్ వినోదయ సీతమ్ డైరెక్ట్ ఎటాక్..!

పవన్ కళ్యాణ్ ఇప్పటికే హరి హర వీరమల్లు సినిమా షూటింగ్ లో ఉన్నాడు. ఆ సినిమా కాకుండా హరీష్ శంకర్ దర్శకత్వంలో ఉస్తాద్ భగత్ సింగ్ మరియు సాహో సుజీత్ దర్శకత్వంలో ఒక సినిమా ను చేయబోతున్నాడు. ఈ రెండు సినిమాల యొక్క పూజా కార్యక్రమాలు జరిగాయి. రెగ్యులర్ షూటింగ్



గురించి అప్డేట్ రావాల్సి ఉంది.ఆ మూడు సినిమాలు మాత్రమే కాకుండా తమిళంలో హిట్ అయిన వినోదయ సీతమ్ సినిమా యొక్క రీమేక్ లో కూడా పవన్ నటించబోతున్నాడు. ఫిబ్రవరి 14వ తారీకున ఆ సినిమా యొక్క పూజా కార్యక్రమాలు లాంచనంగా జరిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లుగా ఆ మధ్య ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరిగింది.కారణం ఏంటో తెలియదు కానీ సినిమా యొక్క పూజా కార్యక్రమాలు నిర్వహించలేదు. కొత్త తేదీని ఖరారు చేసే అవకాశాలు ఉన్నాయని కొందరు అంటూ ఉంటే మరి కొందరు మాత్రం వినోదయ సీతమ్ సినిమా యొక్క పూజా కార్యక్రమాలు లాంచనంగా నిర్వహించకుండా డైరెక్ట్ షూటింగ్ కు వెళ్లే ఆలోచనలో ఉన్నట్లుగా తెలుస్తోంది.పవన్ కళ్యాణ్ తో పాటు ఈ రీమేక్ లో సాయి ధరమ్ తేజ్ కూడా నటించబోతున్న విషయం తెల్సిందే. త్రివిక్రమ్ ఈ రీమేక్ విషయంలో చాలా శ్రద్దను కనబర్చుతున్నాడు. పీపుల్స్ మీడియా బ్యానర్ వారితో కలిసి త్రివిక్రమ్ ఈ సినిమా ను నిర్మించబోతున్నాడు. అంతే కాకుండా రీమేక్ కు రచన సహకారం కూడా అందించినట్లు తెలుస్తోంది. త్రివిక్రమ్ కోసం అయినా పవన్ ఈ రీమేక్ త్వరలోనే చేసే అవకాశాలు ఉన్నాయి.

# దక్షిణాఫ్రికా బ్యాటర్ సంచలన నిర్ణయం.. 30 ఏళ్లకే క్రికెట్‌కు గుడ్‌బై



దక్షిణాఫ్రికా బ్యాటర్ థియునిస్ డి బ్రుయిన్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. 30 ఏళ్ల వయస్సులోనే డి బ్రుయిన్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు.దేశీవాళీ క్రికెట్‌పై దృష్టి పెట్టాలనే ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించాడు. "క్రికెట్‌లో అత్యున్నత స్థాయిలో నా దేశానికి ప్రాతినిథ్యం వహించడం నా అదృష్టం.చాలా మంది ప్రోటీస్ హీరోలతో డ్రెస్సింగ్ రూమ్‌ను పంచుకున్నాను. అదే విధంగా ప్రపంచంలో కొన్ని లీగ్‌ల్లో ఆడాను. అక్కడ కూడా చాలా విషయాలు నేర్చుకున్నాను. నాకు మద్దతుగా నిలిచిన దక్షిణాఫ్రికా క్రికెట్‌కు ధన్యవాదాలు. రాబోయో రోజుల్లో దేశవాళీ టోర్నీలతో పాటు ఫ్రాంచైజీ క్రికెట్‌లో మరింత భాగం అవుతాను" అని డి బ్రుయిన్ పేర్కొన్నాడు.ఇక డి బ్రుయిన్ 2017లో దక్షిణాఫ్రికా తరఫున అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. అతడు ప్రోటీస్ తరఫున 13 టెస్టులు, రెండు టీ20 మ్యాచ్‌లు ఆడాడు. అతడు కెరీర్‌లో ఒక టెస్టు సెంచరీ కూడా ఉంది. 2018లో కొలంబో వేదికగా శ్రీలంకతో జరిగిన ఓ టెస్టు మ్యాచ్‌లో డి బ్రుయిన్ సెంచరీ సాధించాడు.ఇక ఓవరాల్‌గా డి బ్రుయిన్ తన కెరీర్‌లో 496 పరుగులు సాధించాడు. అదే విధంగా ఇటీవల జరిగిన సౌతాఫ్రికా టీ20లో కూడా డి బ్రుయిన్ ఆడాడు. ఈ టోర్నీలో అతడు ప్రిటోరియా క్యాపిటల్స్‌కు ప్రాతినిథ్యం వహించాడు. ఈ టోర్నీలో 12 మ్యాచ్‌లు ఆడిన థియునిస్ 238 పరుగులు సాధించాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**